# * శిశిరవసంతాలు *

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

[గతసంచిక తరువాయి]

## : శరత్తు :

సరస్వతమ్మా! సరస్వతమ్మా!

ఎవరు, వస్తున్నా, ఎవరు వెంకన్న బాబే? ఎన్నాళ్ళకు చూసేను. రండి.

నిన్ను ఇలా సౌభాగ్యవతి గా మళ్ళీ చూసా ననుకోలేదు.

అందుకు అందరితో పాటు మీకూ కోపంవచ్చిందన్న మాట? రండి లోపలికి.

రాకేం, వస్తానమ్మా, ఇంతసేపాయి మీ యిల్లు వెతుక్కుంటూ వచ్చినవాణ్ణి లోపలికి రాకుండా పోతానా? ఇది మీ యిల్లే కదూ?

అవును బాబూ! అలా కూర్చోండి.

కూర్చుంటాను గాని నాకి కుర్చీమీదకంటె నేల మీద నే బాగుంటుంది.

అయ్యో, మట్టి నేలను కూర్చుంటారా? ఉండండి, ఈ తివాసీ వేస్తాను. బాబూ, మీరు మునపటిలాగ ఉన్నట్టు లేదు.

ఎలా ఉంటానమ్మా అరవయ్యారేళ్ళు దాటినవాణ్ణి. అయినా ఇప్పటికీ ఎంతదూరమయినా నడవగలను. ఎంతపనయినా చెయ్యగలను; కాని, మునుపటి ఆ చొరవ ధైర్యం లేవు. అంతేకాదు, కొంచెంసేపు పనిచేసే సరికల్లా అలుపువస్తుంది. మధ్యలో ఆగి ఆగి మళ్ళీ పని చెయ్యవలసి వస్తుంది.

బాబూ, మీది వజ్రశరీరం గనక అరవైఆరేళ్లు దాటినా ఇంకా ఈమాత్రం దృఢంగా ఉండి నిబ్బరంగా మాట్లాడగలుగుతున్నారు. ఈ కాలపువాళ్లయితేనా? యాభైఏళ్ళకే పూర్తిగా ముసలివాళ్ళయి పోతున్నారు. కుర్రవాళ్లుగా ఉండదలచుకొన్నా, తల పండిపోడమో బట్టతల అయిపోడమో, పళ్ళన్నీ ఊడిపోడమో చత్వారం ప్రాప్తించడమో జరుగుతూంది. మన ఊళ్ళో అంతా బాగున్నారా?

ఏమి బాగు సరస్వతమ్మా! అంతా చెట్టుకొక పిట్ట అయిపోయేరు. ఊళ్ళో అన్నీ పార్టీలు, తగాదాలు, కోర్టు వ్యవహారాలు; నన్నుకూడా ఇరికించాలని చూసేరు. నాకు అసహ్యం అనిపించి బయలుదేరి వచ్చేశాను. అప్పుడే రెండేళ్ళయింది. మీ భావగారు అవధాన్లు బ్రతికిఉన్నంతకాలం ఊరంతా అతనెలా అంటే అలా నడిచేది. ఆ తరవాత తలతల పెత్తనాలు. అయితే ఇప్పుడు ఇది ఒక్క మనఊరికి సంబంధించిన వ్యవహారంకాదు, అన్ని ఊళ్ళూ ఇలాగే ఉన్నాయి. ఏమిటమ్మా?—ఈ రాత్రిప్పుడు నాకోసం ఏమీ ప్రయత్నం చెయ్యకు.

ప్రయత్నానికేముంది బాబూ! ఇందాకా మీరు వచ్చేముందే గడియారం తొమ్మిదిగంటలు కొట్టింది. ఆయన మామూలుగా రోజూ భోంచేసే వేళ ఇదే. ఇవాళంటే ఆయన ఊళ్ళో లేరుగనక, నేనూ పిల్లలూ సాయంకాలంతో భోంచేసి పడుకొన్నాము.

ఇప్పుడు నాకేమీ అక్కర్లేదమ్మా—మంచినీళ్లు తాగి పడుకొంటాను.

అయ్యో నామతి చూడండి; మీకు మంచినీళ్లే ఇవ్వడం మరిచిపోయేను. బాబూ! మీరేం అనుమానించకండి. మీకు నా చేతివంట తినడం అనుమానంగా ఉంటే, వస్తువులన్నీ ఇస్తాను, కాస్త ఉడికించేసుకొని భోంచేసి మరీ పడుకొండి.

అదికాదమ్మా! నాకు నీ చేతివంట తినడానికి అభ్యంతరమేమిటి? నీవంటి మంచి మనసుగల మనుషులు లోకంలో ఎందరుంటారు గనక! నే ననేది ఏమిటంటే, ఇవాళ మధ్యాహ్నం భోజనం కావడమే బాగా ఆలస్యం అయింది. ఇప్పుడేమీ ఆకలిగా లేదు. అందుచేత వద్దన్నాను గాని.

ఎందుచేతనయినా సరే మీ రిప్పుడు భోజనం చెయ్యకుండా పడుకొండికి మాత్రం వీల్లేదు. మిమ్మల్ని చూస్తే ప్రాణం లేచివచ్చినట్టుంది. ఊళ్లో అంతా దొంగతనాలు జరుగుతున్నాయిట. ప్రతి

రోజూ ఉదయం లేచేసరికల్లా ఎవరింట్లోనో ఒకరింట్లో దొంగతనం జరిగిందన్నమాటే. ఆయన, వాళ్లమ్మగారు పోయారీమధ్యే, కర్మచెయ్యడానికి కాశీవెళ్ళారు. నాకు ఒకటే భయంగా ఉండి ఈ మూడురోజులాయి సరిగా నిద్రలేదు.

దొంగలు! ఎన్ని గుండెలుండాలి. నీకేం భయం లేదమ్మా!

మరి మీరుండగా నాకేం భయం? కాని, ఏదో దేవుడిలాగ మీరు వచ్చేరు, ఆయన మరి నాలుగు రోజుల్లో రావాలి. ఆయన వచ్చేదాకా మీ రిక్కడే ఉండాలి.

నేను ఫలానా చోటికి ఫలానా పనిమీద అని బయలుదేరలేదులే. సరే చూద్దాముగాని, సరస్వతమ్మా నీకెందుకు శ్రమ. నాలుగు వస్తువులూ ఎక్కడున్నాయో చెప్తే చాలును. అసలిప్పుడు కాస్త మజ్జిగా అన్నంకంటె ఏమీ తినలేను.

అంటే మీరు నా చేతివంట తినడానికి ఇష్టం లేదందురూ?

అదా నామాట కర్థం? నీ యిష్టమే కానీ. నీ పిల్లలంతా నిద్రపోతున్నారు కాబోలు?

అవును బాబూ! ఉదయం చూద్దురుగాని. పెద్దది ఆడపిల్ల, పేరు ఇందిర. తరువాత ఇద్దరూ మగపిల్లలు వసంతకుమార్, శరత్‌కుమార్ అని. తరవాత మగపిల్లవాడయితే హేమంతకుమార్ అని పేరు పెట్టాలనుకున్నారుకాని, ఆడపిల్ల గనక హేమలత అని పేరు పెట్టేరు.

బాగుందమ్మా చాలా బాగుంది. వంతులు వేసినట్టు ఇద్దరు మగపిలలు, ఇద్దరు ఆడపిల్లలు. నీ పిల్లలకి అందానికీ గుణానికీ చెప్పేదేమిటి? మీ ఆయనకూడా చాలా రూపవంతుడు, గుణవంతుడూ అని విన్నాను. మీ అన్నయ్య చెప్పాడు.

మా అన్నయ్యకి చిన్నప్పటినుండి ఈయన మాటంటే వేదవాక్యం. అయితే మా అన్నయ్యగారి ఊరు వెళ్ళివస్తున్నా రన్నమాట? మా వదినవంట్లో ఎలాఉంది?

ఇదివరకు ఏడాది కిందటినుండి ఎలాఉందో అలాగే ఉంది. మీ అన్నయ్య చాలా నిస్పృహగా మాట్లాడేడు. మీ పెద్దమేనల్లుడికి స్కూలు మాష్టరీ ఉద్యోగం అయిందిట మొన్న ఉదయమే ఉద్యోగంలో ప్రవేశించడానికి వెళ్లేడు.

మా కృష్ణుడప్పుడే ఉద్యోగస్థుడయేడన్నమాట. చూసేవా మా అన్నయ్య! ఉత్తరమయినా రాశాడు కాడు.

రాయకేమమ్మా రాశాడు, రేపటికో ఎప్పటికో అందుతుంది. మీ అన్నయ్యకి ఎలా ఉందంటే తనే ఈ పరీక్షలన్నీ పాసయి ఉద్యోగానికి వెళ్తున్నట్టుంది.

ఉండదూ మరి, అసలు చిన్నతనంలో ఒక, నాడు సంస్కృతం చదువు అంటే ఇష్టంలేక. ఈయనా మా అన్నయ్యా కలిసి ఇంటినుండి పారిపోయి ఇంగ్లీషు చదువు చదువుకోవా లనుకొన్నారు.

అబ్బో, అయితే యాజులు సామాన్యడు కాడన్నమాట?

అనుకోడంవరకూ అంతే. అయితే తీరా రయిలెక్కే వేళకి మా అన్నయ్యకి ధైర్యం చాలిందికాదు. తను ఉండిపోయేడు. ఈయనమాత్రం తరువాత ఎన్ని ఇబ్బందులు పడినా మరి ఇంటికి తిరిగిరాలేదు చదువు పూర్తయేదాకా!

పట్టుదలగలవాళ్ల సంగతే అంత!

మా అన్నయ్య ఉండిపోడం అయితే ఉండిపోయేడు గాని వాడి మనస్సంతా ఇంగ్లీషు చదువుమీదే ఉండేది. ఇప్పుడు వాడికొడుకింతవాడయేడంటే అదంతా తను చేసిన పనిలాగే ఉంటుంది మా అన్నయ్యకు. నామట్టుకు నాకే ఆశ్చర్యంగా ఉంది. నిన్నమొన్నటిదాకా అన్నం సరిగా కలుపుకొని తినడం కూడా చేతనయేదికాదు మా కృష్ణుడికి మా వసంతుడికిలాగే. ఎంతలో ఎంతవాడయిపోయేడు. వాడు చిన్నప్పటినుండి నాతో అంటూ ఉండేవాడు, అత్తయ్యా నాకు పెద్దపెద్ద ఉద్యోగాలకంటే స్కూలు మాష్టరవడమే సరదా అని.

మరేమిటనుకొన్నావమ్మా పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది.

పోనీ మా వదిన బ్రతికివుండగానే కొడుకు ప్రయోజకుడు, ఉద్యోగస్థుడయేడన్నమాట వింది. తాను బ్రతికిఉండగానే వాడి పెళ్ళి అయిపోయిందంటే ఆవిడ మనస్సుకి మరి విచారం అన్నది ఉండదు.

పెళ్ళికేముంది? తల్చుకొంటే నెల్లాళ్ళలో అయిపోతుంది. అయినా ఇంట్లోనే సంబంధం ఉంది కదా? ఈ రోజుల్లో మునుపటిలాటి పట్టింపులులేవు పెద్దపెద్దవాళ్ళే ఎదురు మేనరికాలు చేసేస్తున్నారు.

అజా, మా పిల్లను ఇవ్వడం మాటా? నాకూ మా ఆయనకికూడా అభ్యంతరం లేదుగాని, ఇంకా ఏదీ మా పిల్లకి పదవఏడు నిండలేదు. వాడూ చిన్నవాడే అనుకో, అయినా, ఉద్యోగస్థుడయేడు, పెళ్లవగానే సంసారం దిద్దడానికి తగిన పిల్లయితే బాగుంటుంది. వీటన్నిటి మాటకేమీ, మా పిల్ల పుట్టినప్పటి దగ్గరనుండి దాని పెళ్ళి నిశ్చయమయిపోయింది. మా ఆయన చెల్లెలుకొడుకు ఉన్నాడు. పదహారోఏడు వచ్చిందనుకొంటాను.

బాగుందమ్మా బాగుంది. ఏ సంబంధం అయితేనేం, వాళ్ళు బ్రతికి బాగుండాలి. ఫలానా వాళ్ళ పిల్లలమని పేరు నిలబెట్టాలి.

ఏదీ ఇంకా వీళ్లు పసిపిల్లలు. వీళ్ల పెళ్లిళ్లకేం తొందరొచ్చింది? వాడు మా మేనల్లుడు వెంకటరమణ సెలవులకి వస్తానన్నాడు, రెండుమూడు రోజుల్లో రావాలి. బాబూ, హనుమంతుడిదగ్గర కుప్పిగంతులని మీరుండగా నేను వంటచెయ్యడమేమిటి? మీ చేత్తో పొయ్యిమీద పెడితే చాలు ఏ వస్తువుని ఎలా ఎంత సేపటిలో ఉడకమంటే అలాగే ఉడుకుతుంది.

పూర్వులిచ్చిన ఆస్తిపాస్తులేవీ దక్కకపోయినా ఇంకా ఆ ఒక్క శక్తిమాత్రం మిగిలిఉంది తల్లీ—దాన్ని నమ్ముకొనే ఇలా పట్నం చేరుకొన్నాను. మునుపటి ఆ బలం, ఎంతమందికయినా సరే ఎంత తక్కువ వ్యవధిలోనయినా ఎలా కావలిస్తే అలా చేస్తానన్న ధైర్యం లేవు. అంతేకాదు, వంట చేసేవాడికి ఏది ముఖ్యంగా కూడదో అది, అనుమానం వస్తుంటుంది. అయినా ఏదో పూర్వపువాసన ఇంకా పోలేదు. మీఆయన వస్తే ఆయన సాయం చాలా కావాలి. ఎవళ్లయినా తగినవాళ్లింట్లో కుదురుకొంటే మన జీవితం వెళ్లిపోతుంది. నాకేమీ డబ్బును గురించి పెద్ద ఆశలేదు—నా కెవళ్లున్నారు గనక? అయితే కాస్త మర్యాదస్థులూ, మంచీచెడ్డా తెలిసినవాళ్ళూ అయితే చాలును. అంచేత మీ ఆయన వచ్చాక...

అలాగే బాబూ, ఎంత కావాలంటే మాత్రం మీలాటివాళ్ల సాయం అందరికీ దొరుకుతుందా? మా ఆడబడుచుగారింట్లో ఈమధ్యని చాలా ఇబ్బంది పడుతున్నారు. ఏ ఒక్క మనిషీ మూణ్ణెల్లయినా ఉండడంలేదు. వాళ్లదీ మరేమంత పెద్దసంసారం కాదుగాని, ఆవిడకి చిన్నప్పటినుండీ పనీ పాటా ఒకరి చాటునుండి చెయ్యడమేగాని, స్వయంగా చెయ్యడం అలవాటులేదు. అందుకు తోడు ఎనమండుగురు పిల్లలు - ఆయన ప్లీడరు, పెద్దప్రాక్టీసు - ఎప్పుడూ ఎవరో బంధువులూ స్నేహితులూ ఇంటికి వస్తూనే ఉంటారు.

చాలా బాగుంది తల్లీ—అటువంటి వాళ్లకయితే మనమూ ఉపయోగపడగలము—వారికీ నాలాటివాణ్ణి పోషించడం కష్టంగా ఉండదు.

అదేమిటి బాబూ అలా అంటారు; నిజంగా నేను చెప్తున్నాను; మీలాటి సాయం కావాలంటే మాత్రం దొరుకుతుందా? నామాట ఆయన కాదంటారని కాదుగాని, ఆడదాన్ని నే నెందుకనాలని ఊరుకొన్నాను. మా ఆయనవస్తే మిమ్మల్ని మరోకచోటికి వెళ్లనివ్వరు. నాకు ఇంటిపనంటే ఏమీ కష్టంలేదనుకోండి, అయినా మీలాంటివాళ్ల సాయం ఎలా వస్తుంది చెప్పండి?

సాయంకోసమని నాలాటివాణ్ణి భరించగలరా తల్లీ ?

బాబూ! ఆయన వచ్చేక ఎలా బాగుంటుందంటే అలా చేద్దాము—వంటయిపోయింది. మీరు స్నానం చేస్తారుకాబోలు; ఈలోగా నేను వడ్డన ప్రయత్నం చేస్తాను.

నేను వడ్డించుకొని తినలేనటమ్మా, నీకుకూడా ఎందుకు నిద్రదండుగ?

చెప్పానుకాదూ, ఈ మూడురోజులాయి నాకు రాత్రి నిద్ర లేనేలేదని. ఇవాళకూడా నిద్ర పట్టేలాగలేదు. మీరు మీ చిన్నతనపు కబుర్లు చెప్తూ ఉంటే వినాలనుంది.

అలాగేనమ్మా! నా కబుర్లకేమిటి ఎప్పుడూ ఉన్నవే. అయితే మీ ఆయన కేమిటీ ఉద్యోగం అన్నావు?

ఉద్యోగం అని జీతం అదీ కాదు; అచ్చాఫీసు. అందులో పుస్తకాలు, పరీక్షల పేపర్లు అవీ అచ్చువేస్తూఉంటారు. అంతా ఆయనకింద ఒక పదిపన్నెండుమంది పనివాళ్లుంటారు. ఇప్పుడొక పుస్తకాల షాపుగూడా పెడతానంటున్నారు. అయితే దానికి నమ్మకస్తుడయిన మనిషి ఎవరయినా దొరకాలంటున్నారు. తానే రెండూ చేసుకోవాలంటే కష్టం, ప్రెస్సు బజార్లో కాకుండా ఒక మూలగా ఉంది.

బాగుందమ్మా చాలా బాగుంది. పదిపన్నెండుమంది పనివాళ్ళున్నారంటే, వాళ్లందరి జీతాలు

పోగా మనకి ఒక వంద ఉంటుందా? నేను పూర్వ కాలంవాణ్ణి, అంచేత నాకీ సంగతులేవీ తెలీవు, ఇలా అడిగేనని ఏమీ అనుకోకు.

అనుకోడాని కేముంది బాబూ? మేము బాగున్నామంటే మీరూ మా అన్నయ్యలాగ సంతోషించేవాళ్లేకాని, వేరు కాదుకదా! సరిగా నెలకి ఎంత వస్తుందో ఏమిటో నాకు తెలీదుగాని, రెండు మూడు వందలుకూడా కొన్నికొన్ని నెలల్లో ఉంటుందిట. అయితే తక్కినవాళ్లలాగ పనివాళ్లని హింసించి ఎక్కువ పని చేయించి, తక్కువ జీతాలిచ్చే మాటయితే ఇంకా బాగానే మిగలవచ్చునట. వాళ్ల కడుపుమాడ్చి మనం మిగుల్చుకోడం దేనికంటా రాయన.

ఈ రోజుల్లో అటువంటి ధర్మబుద్ధి ఎవరికుంది తల్లీ! అటువంటివాళ్లకి భగవంతుడు ఆ విధంగానే ఇస్తాడు. నీ మాటలు వింటూంటేనే మరి నేను మీ యిల్లు విడిచిపోలేనేమో అనిపిస్తుంది. అయితే ఏదో నా చేతనయినపని చెయ్యందీ మాత్రం నేనుండలేను. నాచేత ఎంతపని చేయించుకొన్నా నాకు పెట్టే తిండికి తగిన ప్రతిఫలం కాదనుకో—

బాబూ! వడ్డన పూర్తయింది. నా ఆలస్యం మరి లేదు.

ఇదుగో వస్తున్నాను—కొస్త బొట్టుందా?

ఆఁ ఇదుగో ఇక్కడ పీటదగ్గర ఉంచేను.

*　　　*　　　*

అమ్మాయి, సరస్వతమ్మా!

ఏమిటి బాబూ, ఓహో ఏమిటి తామరపువ్వులు కలవపువ్వులూనూ! ఎక్కడ దొరికేయివన్నీ?

మన చెరువులోనివే నమ్మా; అమ్మాయి ఇందిరకి ఇవంటే ఎంతో ఇష్టం.

నీ కెంత జ్ఞాపకం వెంకన్నబాబూ! అయితే ఇవాళ అల్లుడూ అమ్మాయి వస్తారంటావా?

ఎందుకురారమ్మా! అల్లుడు ఉత్తరం రాశాడు కదూ?

ఉత్తరం రాస్తేమటుకు అతగాడిమాట ఏం నమ్మకం? ఇదివర కెన్నిమార్లయిందికాదు, అనుకొన్ననాటికి రాకపోడం.

ఆఁ ఎందుకు రాకపోతారు? ఏదో అంత అవసరం పడితే తప్ప.

అతగాడికిఉన్న పెద్ద పనేమిటి లెద్దురూ అక్కడయినా తిరగడమే, ఇక్కడయినా తిరగడమే కదూ! తన తమ్ముళ్లు కాలేజీల్లో పెద్దపెద్ద చదువులు చదువుతూఉంటే అతగాడికి సిగ్గులేకపోయింది. చదువు మానేసి కూర్చున్నాడు. వాళ్ళ నాన్నగారు అన్నారు. పోనీ చదవకపోతే మానిపోయేను, మరేదయినా వ్యాపృత్తి కల్పించుకో అని. నీకొక్క వలసిన డబ్బిస్తాను, ఏదయినా షాపుపెట్టు అన్నారు. ఊఁహుఁ ఇష్టంలేకపోయింది. ఈయన పోనీ ఏపనీ చెయ్యవద్దు, ఇక్కడ ప్రెస్సుకివచ్చి ఒక గంట కూర్చొని వస్తూపోతూ ఉండమన్నారు. అదీ నచ్చింది కాదు, ఎందుకు నచ్చుతుందీ, డబ్బు తెచ్చే శ్రమలేకుండా ఎంత కావాలంటే అంత ఇచ్చే తల్లిదండ్రులున్నప్పుడు ఎవరికిమాత్రం మంచిబుద్ధు లెలా పుడతాయి?

అదేమిటమ్మా అలా అంటావు? అతని తమ్ముళ్లకి మాత్రం తల్లిదండ్రులు కావలసిన డబ్బియ్యలేదనా? వాళ్లంతా ఎంతశ్రద్ధగా చదువుకొంటున్నారు గారు.

అవును బాబూ, మన అదృష్టం అనుకోవాలంతే.

ఇంత మాత్రంలో అదృష్టానికీ దురదృష్టానికీ ఏముంది? వాళ్ల నాన్నగారు రెండుచేతులా ఆర్జిస్తున్నారు.

ఆర్జిస్తేమటుకు ఆరుగురు అన్నదమ్ములు పంచుకోవాలి; ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చెయ్యాలి. ఇంతకీ మగవాడన్నవాడు స్వశక్తిమీద ఆధారపడాలిగాని తల్లిదండ్రు లిచ్చిన ఆస్తిమీద ఆధారపడితే ఏముంది?

ఏం చెప్పమన్నావు తల్లీ—మేము అయిదుగురు అన్నదమ్ములం. చిన్నతనంలో నన్నే మావాళ్లందరిలోకీ తెలివయిన వాడనుకొన్నారు. కాని కొంచెం వయసు వచ్చిన దగ్గరనుండీ నాకు కుస్తీలు సాము గరీడీలు ఇవీ, ఇంటికివస్తే వంట-తిండి ఇవే కావలసినవి. కొసకి, మావాళ్లంతా వేదాల్లో ఇద్దరూ, శాస్త్రాల్లో ఇద్దరూ దిగ్దంతులమనిపించుకొన్నారు. నేనూ నా కాలంలో కొంత పేరు సంపాదించకపోలేదు, వాళ్లలాగ వేదంలోనూ శాస్త్రాల్లోనూ కాకపోయినా వంటలోనూ తిండిలోనూ. అయితే నేను చెడ్డానంటే నావల్ల బాధపడే సంసారమునే జాదరబందీ ఏమీ లేదు.

అదే బాబూ నేననేదీని. ఎల్లప్పుడూ ఇలాగే ఉంటుందా? కొసవరకూ తల్లిదండ్రులమీద ఆధార

పడదామంటే సాగుతుందా? అదేమిటో ఆయనా ఈయనా కూడా అతని ఊసు మరి నాతో చెప్పకు అని ఊరుకుంటారు. ఆడదాన్ని నే నేం చెప్పగలను?

ఏమీ చెప్పనక్కరలేదమ్మా! అతను కుర్రవాడు స్వతహాగా చాలా తెలివయినవాడే. ఎప్పుడో ఒకనాడు తన బాధ్యత తాను గుర్తించకపోడు. అసలే లేదనకుండా మెటికులేషను వరకూ చదువుకొన్నాడు కదా తనకి ఎప్పుడో బుద్ధిపుట్టి ఏదయినా మంచిపని చేస్తానంటే తన్ను ఆదుకునేందుకు అవతల తండ్రీ ఇవతల మామగారూ ఉన్నారు. మరి నాకు పాపుకి వేళయింది. బాబు అప్పుడే నేను చెరువునుండి వస్తున్నప్పుడు ప్రెస్సుకి వెళ్తూ కనిపించేడు. అయితే స్టేషనుకి పిల్లల్నిద్దర్నీ పంపిస్తావుకదూ! బజారు వస్తువులేవయినా కావలిస్తే చెప్పు—మధ్యాహ్నం వచ్చినప్పుడు తెస్తాను.

*　　　*　　　*　　　*

అమ్మా! అమ్మా! సరస్వతమ్మా!!

ఏమిటి వెంకన్నబాబూ అంత గాభరాగా పిలిచేవు.

పిల్లలమార్కు లొచ్చాయిటమ్మా. చిన్నబ్బాయి పెద్దబాబు పేరు నిలబెట్టేడు. మళ్ళీ తను స్కూలుకి ఫస్టు వచ్చేడు.

అలాగా వాళ్ళేరీ?

వాళ్ళింకా స్కూల్లో తక్కిన పిల్లల మార్కులూ అవీ చూస్తున్నారు; నన్ను వెళ్లి నీకు చెప్పమన్నారు.

అమ్మాయేదీ.

అమ్మాయికూడా అక్కడే ఉంది. రెండేళ్ళ క్రితం పెద్దబ్బాయి స్కూలంతటికీ ఫస్టుగా వచ్చేడు. అయితే అప్పుడు అతనికి పోటీయే లేదట. ఇతని తరవాత వాడికి నలభైమార్కులు తక్కువవచ్చేయిట. చిన్నబ్బాయికి అలా కాదు, ఈ క్లాసులోకి వచ్చేవరకు తనమీది వాళ్లు నలుగురు ఉండేవారట. ఈ సంవత్సరం మొదట పెద్దబ్బాయి, తమ్ముడూ నువ్వు స్కూలుకి ఫస్టుగా రాకపోతే నన్ను నలుగురూ నవ్వుతార్రా అన్నాడట! దాంతో మానేవుకదూ, ఎలా చదివేవాడో మనం వద్దంటున్నాను. నలుగురినీ మించేడట. పాపం వాళ్ళూ పట్టుదలగా నే చదివి ఉండాలి, మూడు, నాలుగు ఎనిమిది పదిమార్కులు తక్కువ వచ్చాయిట. వాళ్లి హెడ్మాస్టరుగారు అబ్బాయిని ఎంత మెచ్చుకొంటున్నా రనుకొన్నారు!

అమ్మాయి హేమసురించికూడా మళ్ళీ పెద్దబ్బాయిలాగే ఏ అనుమానమూ లేదట. సరిగా వేళకి బాబుగారు లేకపోయారు.

ఉంటే ఆయన పిల్లలకంటె ఒళ్ళు తెలియకపోదురు.

కాదుటమ్మా! ఇటువంటి ఆనందం అందరికీ రమ్మంటే వస్తుందా? ఏమిటి నీ విచారం, అల్లుడిగురించేనా? చూస్తూఉండు, నేను బ్రతికిఉంటానో లేదో, అప్పుడు నువ్వు అనుకొంటావు ఆనాడు వెంకన్నబాబు అన్నాడని. వాళ్ళన్నదమ్ము లందరిలోకీ మీ అల్లుడే ప్రయోజకు డవుతాడు.

అతనేం పెద్ద ప్రయోజకుడు కానక్కరలేదు, అందరితోపాటు ఒకళ్లమీద ఆధారపడకుండా తన బ్రతుకు తాను బ్రతకగలిగితే చాలును.

నీ కెందుకింత విచారమో నా కర్థం కాకుండా ఉంది. పిల్లలింక వచ్చేవేళయింది. వాళ్లకి బాబుంటే ఎలాగూ చేసేదే. వెళ్లి బట్టలు కుట్టించుకోమనమ్మా! ఇవాళ మరి నువ్వు వద్దు, నేను మడికట్టుకొంటాను. అబ్బాయిలు తమ ఫస్టుక్లాసుల సంగతి చెప్పుకొంటూ ఉంటే నా ఫస్టుక్లాసు ప్రజ్ఞమాత్రం చూపించకపోతే ఎలాగ? నువ్వేం చెప్పకు. మరి నాకు మళ్ళీ బజారుకి వెళ్ళిరావడానికి వేళలేదు; పనిమినిషిని పంపిస్తాను.

అలాగే కానీబాబూ! వీళ్లిప్పటిలాగే కొంత వరకూ చదువుకొంటే అంతే చాలును. బాబూ, ఎప్పటికప్పుడు అనుకోడమేగాని తిరపతి వెళ్లడం కాకుండాఉంది. ఆయన మరేమీ అక్కడ చికాకు లేకుండా ఇంటికి తిరిగివస్తే, పిల్లలకి సెలవులుండగానే ఈ సంవత్సరమే వెళ్ళాలి.

ఔనమ్మా! తప్పకుండా వెళ్ళండి. ఇక్కడ నే నుండగా ఇంటిలో పూచికపుల్లపోదు.

అదేమిటి వెంకన్నబాబూ! నువ్వు రాకుండా మేము వెళ్తామా? పొరుగువారి ఇద్దరు పిల్లలూ వచ్చేరు. వాళ్లకి జాగా చాలకుండావుంది. వాళ్లకి ఇల్లు అప్పజెప్పి వెళ్తాము. మళ్లీమళ్లీ వెళ్లగలమో లేదో నాలుగు యాత్రలూ చేసుకొని రావాలి.

అలాగే చేద్దామమ్మా! ఇవాళ ఏమవుతుందో నా పరీక్ష! ఫస్టుక్లాసు కాకపోతే మానె పరీక్షయినా పాసవుతుందో లేదో?

నీ వంటకి వంకలు పెట్టేవాళ్లెవరు వెంకన్నబాబూ!

ఏమో నాదంతా పూర్వంకాలపు పద్ధతి—అయినా యథాశక్తి ప్రయత్నించి చూస్తాను—

*          *          *

అమ్మా! సరస్వతమ్మా! మేలుకొనే ఉన్నావా?

వెంకన్నబాబూ! ఇంకా రేపు ఉదయానికి వస్తావనుకొన్నాను.

మొదట నేనూ అలాగే అనుకొన్నానుగాని ఆయింటి పద్ధతి చూసేక మరి ఉండాలనిపించలేదు.

ఏమిటి? మరేమయినా?

ఏమీలేదు, ఇదివరకు మీరంతా అనుకొంటూ ఉంటే నేను నమ్మలేకపోయేవాణ్ణి. ఆ యింటిలో యజమానురాలు ఎవరో నాకు బోధపడలేదు.

ఏం, మా వదినకు వంట్లో బాగాలేదా?

ఆవిడ ఎప్పుడూ అంతేనట. వేళకువచ్చి భోజనంచేసి వెళ్ళిపోడం. గదిలో ఏదో పుస్తకం చదువుకుంటూ కూర్చోడం, పడుకోవడం, ఇంట్లో ఎవరికి ఏది కావలసివచ్చినా అన్నిటికీ రుక్మిణమ్మే. ఆవిడను చూసినవాళ్ళెవళ్లూ వంటమనిషి అనుకోరు.

అసలు ఆవిడ వంటమనిషి కానేకాదు. పిల్లలకి చదువు చెప్పడానికి వచ్చింది. ఆ తరవాత మావదిన అనారోగ్యంలో ఇంటిపనంతా తనే చేసేది.

ఇప్పుడసలు ఆవిడ చేస్తున్న పనేమిటో నాకర్థంకాకుండా ఉంది. అంతా అజమాయిషీయే. వంటకి వేరేమనిషి ఉన్నాడు. ఆవిడమాత్రం ఆయనకు కాఫీ ఫలహారమూ అందిస్తుంది; ఆయనకు సరిపడినన్ని తమలపాకులు సిగరెట్లూ ఉన్నాయో లేవో చూస్తుంది. కారణం ఉన్నా లేకపోయినా పనివాళ్ల మీద కేకలేస్తూ ఉంటుంది. అసలు మన అల్లుడు చెడుదారి పట్టడానికి సగంమట్టుకు ఆమనిషే కారణమని నా నమ్మకం. తెలిసీ తెలియకుండా విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకొందికి డబ్బిస్తే ఏమవుతుంది?

డబ్బిస్తేమాత్రం చెడిపోతారా వెంకన్నబాబూ, తక్కినవాళ్లంతా బాగా చదువుకొంటున్నారుకారూ?

అదీ నిజమేలే తల్లీ మగపిల్లలంతా మంచి ముత్యాలలాటివాళ్ళు. కాని, ఆ ఆడపిల్లలకి మాత్రం రోజురోజంతా ముస్తాబు చేసుకొందికే చాలకుండా ఉందంటే నమ్మ; కాక, వాళ్ళనని లాభంలేదు. ఎదురుగా కనుపించే మంచినికంటే చెడ్డనే వేగం నేర్చుకొంటారు. కబుర్లంత చలాకీగా చెప్తారా, ఒక్కరూ తప్పిపోకుండా ఏ క్లాసూ పాసుకాడం లేదట; అసలువాళ్ళకు చదవడానికి సమయమే ఉన్నట్టులేదు.

సరేబాబూ! ఎవరి అదృష్టానికి వారే కర్తలు. మనమేంచేస్తాం? ఎంతటి మహావృక్షమయినా పురుగు పట్టి దొలిచివేస్తే అంతే, గుల్లదేరిపోతుంది. మాటల్లో పడి అసలుమాట అడగడం మరిచాను. అల్లుడు పంపడం ఆలస్యమయిందని ఏమయినా అన్నాడేమిటి?

అమ్మా అతనిసంగతి అంతా తెలిసిఉండి నన్నెందుకు అడుగుతావు. నువ్వేమయినా అంటావేమోనని ఊరుకొన్నానుగాని, గట్టిగా రెండు తగలనియ్యాలనిపించింది. అలా అయితేనేగాని మరి దారిలోకి రాడేమో.

ఏమన్నాడేమిటి? నిన్నేమయినా...

నన్నంటే నాకేం విచారంలేదు. బాబుగారికి వంట్లో బాగులేదని తెలిసికూడా మామగారికి తనకి రావడానికి పరువుతక్కువయింది కాబోలు వంట బ్రాహ్మణ్ణిచ్చి పంపించేడు. ఈమారు నేనూ మా నౌఖరువాణ్ణిచ్చి పంపిస్తానన్నాడు.

పోనీ అంతేకదా? అంచేతే నేనన్నాను, అబ్బాయిల్లో ఎవళ్ళనో ఒకళ్లని వెళ్లమని.

ఎలా వెళ్తారమ్మా, వారంరోజుల్లో పరీక్షలు పెట్టుకొని. అసలు మీరూ అమ్మాయీ గాభరా పడ్డారు తప్ప ఇప్పుడెంత తొందర ఏంవొచ్చింది? తీరా అక్కడకు వెళ్లేక ఆవాహనాలేదు విసర్జనా లేదు. అతని సంచారం మామూలుగానే సాగుతోంది. ఇంట్లో అమ్మాయి పనిచేస్తే మెప్పులేదు, చెయ్యకపోతే మాత్రం తప్పు. ఇక అతగాడికి ఎప్పుడు వస్తుందో ఆగ్రహం, ఒళ్లూపయినా తెలియదు. అందులో మునపటిలాగ కాదుకదా చంటిపిల్లతల్లి.

ఏంచేస్తాం వెంకన్నబాబూ! అన్నిటికీ ఆ వెంకటేశ్వరుడే ఉన్నాడు.

అదుగో అదే నాకు నచ్చదు. నువ్వుచచ్చిగీపెట్టినా అమ్మాయిని పంపించం, కావాలంటే వచ్చి ఇక్కడ ఉండు. లేదా, ఎక్కడో ఉద్యోగంచేసి, స్వతంత్రంగా బ్రతకడం అంటే ఏమిటో నేర్చుకొంటే పంపిస్తామంటే మూడురోజుల్లో దారికి వస్తాడు.

ఏమిటో బాబూ! తానూ తండ్రిలాగ ఇంట్లో నే ఎవతెనో తెచ్చిపెట్టుకొంటాడని అమ్మాయి భయం. ఇదంతా నా దురదృష్టం—ఎవళ్లననుకొనీ ఏంలాభం?

# : హేమంతం :

## — 10-11-45 —

ఉదయం మామూలుగా ప్రెస్సుపని. మ్యునిసిపల్ హైస్కూలు పరీక్ష పేపర్లు న్యాయంగా ఈరోజున ఇవ్వవలసింది. మామూలుగా ఒక రోజు ముందుగానే అయేది, రేపు రోజంతా తక్కిన పనులన్నీ వెనకబెట్టి చేస్తే, సాయంకాలానికి పూర్తికావచ్చును.

మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి బావగారి పెద్ద గుమాస్తా రాసిన ఉత్తరం అందింది. ఆయనకు పది రోజులనుండి ఉష్ణమట. టెంపరేచరు చాలా ఎక్కువగా ఉందిట. టైఫాయిడులాగుందని డాక్టరన్నాడట. ఒకమారు మీరు వస్తే బాగుంటుందని రాశాడు. వెళ్ళడానికి ఏమీ అభ్యంతరం లేదు, కాని వెళ్ళి చెయ్యగలిగే దేమిటి? ఏమైనాసరే వెళ్లకపోతే బాగుండదు. రేపు సాయంత్రం ఈ పరీక్ష పేపర్లు అప్పజెప్పేసి, రాత్రి బండిలో బయలుదేరి వెళ్లాలి.

పెద్దమ్మాయిని చూసి కూడా ఆరు నెల్లయింది. మళ్ళీ ఈలోగా నెల తప్పిందేమో? భార్యా భర్తల మధ్య అనురాగం సామరస్యం లేకపోయినా సంతానానికి మాత్రం లోటు లేదు. ఇప్పటికప్పుడే ముగ్గురు. అతను చదువు లేదు, ఉద్యోగం లేదు; సరస్వతికి ఎప్పుడూ ఇదే మనోవ్యధ. పాపం నాదగ్గర దాచడానికి ప్రయత్నిస్తుంది. తక్కిన పిల్లలందరికంటె తెలివయింది ఇందిర; చదివించి ఉంటే ఈసరికి హాయిగా బి. యేవో ఎమ్. ఏవో పాసయిఉండును. అప్పుడు సరస్వతిమాట విని దాని చదువు అశ్రద్ధ చేయడం జరిగింది. ఇప్పుడు దాని భవిష్యత్తు ఏమిటో అర్థం కాకుండా ఉంది.

## — 12-11-1945 —

నిన్న రాత్రి అంతా రయిలు ప్రయాణం. ఇక్కడకు వచ్చిన తరవాతకూడా పడుకోండికి వీలులేకపోయింది. పగలుకూడా కాస్తసేపు విశ్రాంతిగా పడుకోండామంటే సావకాశం లేకపోయింది. అంతా ఏదో గొడవ, గాభరా. ఇంట్లో ఇంటి యజమాని ప్రమాదకరమయిన జబ్బుతో పడిఉన్నాడనే స్ఫురణేఉన్నట్టు లేదు. శాంత ఒక నిర్జీవప్రతిమలాగ కూర్చుంటూంది. పూర్వం తన గదిలో వేరే కూర్చునేది; ఇప్పుడు జబ్బు మనిషి గదిలో అలా కిటికీలోంచి చూస్తూ కూర్చుంటూంది. డాక్టరు వస్తున్నాడు. వెళ్తున్నాడు. అంతే.

అమ్మాయి ఇందిర పాపం నాకు ఎక్కడ అసౌకర్యంగా ఉంటుందో అని నా సదుపాయాలు చూడబోతుంది.

పది పదిహేనేళ్ళ క్రితం బావనూ శాంతనూ చూసిన వాళ్ళెవరయినా ఇప్పటి పరిస్థితిని ఊహించగలరా?

ఈ ఇంటిలో నేనుండి చేయగలిగే దేమిటో బోధపడకుండా ఉంది. అలాగని వెళ్ళిపోతే బాగుండదు.

ఏదో వాళ్ళ బాధ వాళ్లు పడతారు, ఈ వ్యాధి అంటూ నయమయితే నిశ్చింతగా ఉంటుంది. అప్పుడొకమారు కాపాడేడు, యాజులును రమ్మని వైరిస్తే! తీరా వాడు వచ్చినా వాడివైద్యానికి సమ్మతించేవాళ్లెవరిక్కడ? కానీ మనకి మంచిదని తోచినపనిచేద్దాం, తరవాత భగవదిచ్ఛ.

## — 25-11-45 —

ఉదయం మామూలుగా ప్రెస్సుకి వెళ్లేను. ఈవారం పదిరోజులూ బావగారిఊళ్ళో ఉండడంవల్ల కొంచెంసేపు అంతా కొత్తగా అనిపించింది. ఈలోగా దుర్గారావు అంతా సరిగానే నడిపించినట్టున్నాడు. కొంచెం కోపం, బిగ్గరగా కేకలు వెయ్యడంతప్ప చాలా విశ్వసనీయుడు. పని ఖచితంగా చేస్తాడు.

షాపులో అమ్మకంకూడా బాగానే సాగుతూంది. రెండు లైబ్రరీల పెద్ద ఆర్డర్లు వచ్చాయి. వెంకన్నబాబు నేను వచ్చేదాకా అవి ఆలస్యం చెయ్యకుండా పెద్దబ్బాయి సాయంతో పుస్తకాలు సకాలంలో పంపించాడు.

అమ్మాయి ఇందిరని తీసుకొని రాలేదని సరస్వతికి ఎంతో నిరుత్సాహంగా ఉంది. కాని, ఏం చెయ్యడం? అసలు రావడానికి అమ్మాయికే ఇష్టంలేదు. ఈ ఆడవాళ్ళదంతా అదొక చిత్రం. ఎంత తెలివయినవాళ్ళయినా వాళ్లుమాత్రం మామూలు పద్ధతిని ఆలోచించరు. తమకు సామాన్యంగా అవకాశం ఉన్నపాటి సౌఖ్యాన్ని పొందడంకూడా ఏదో పెద్దనేరం అనుకుంటారు. శాంత, సరస్వతి, ఇందిర— అందరూ ఒకటే, గోరంతలు కొండంతలు చేసుకొని బాధపడతారు.

## — 26-11-45 —

ఉదయం అంతా మామూలుగా గడిచింది.

మధ్యాహ్నం అట్టే పని లేదు. దుర్గారావుతో చెప్పి ఇంటికి వెళ్లి పడుకుందామనుకొంటూ ఉండగా పదహారేళ్ళ కుర్రవాడొకడు వచ్చేడు. ఎంతో దీనంగా ఉన్నాడు. నాకు చిన్నతనంలో తమ యింట్లో బస యిచ్చిన పట్టాభిరామయ్యగారి మనవడట — అందులోనూ పౌత్రుడు. ఇప్పుడు స్కూలు జీతానికీ పుస్తకాలకీ లేక ఇబ్బంది పడుతున్నాడట! ఆరోజుల్లో ఆయన తాసిల్దారుగా ఉండేవారు. ఎంతో ఆర్జించారు. అంతా ఏమీ మిగలలేదట. ఆ పెద్దభవంతి కూడా అమ్మివేయవలసి వచ్చిందిట. పాపం, ఈ కుర్రవాడికి ఇప్పుడొక మేనత్త తప్ప మరెవరూ లేరట. మా యింట్లో నే ఉండి చదువుకొమన్నాను. ఇది సరస్వతికి అట్టే ఇష్టం ఉన్నట్టు లేదు. అతనికిప్పుడు బసకీ భోజనానికీ ఇబ్బంది లేదు కదూ. జీతానికీ పుస్తకాలకీ ఏదో సహాయం చెయ్యకూడదా అంది. ఈ అబ్బాయి మొగంలో దీనత్వమూ వినయమూ కావలసినంత ఉన్నాయి కాని తెలివితేటలూ చురుకుదనమూ తగినంతగా ఉన్నట్టు లేవు. ఇతడి మూలంగా పిల్లల చదువుకి ఏమి అసౌకర్యంగా ఉంటుందోనని దాని భయం. అందులోనూ హేమ చదువుకొంటున్నది కూడా. ఇంట్లో ఎవడో పరాయి కుర్రవాడు ఉంటున్నాడంటే ఏమి మాట వస్తుందోనని — కాని, వీధికొట్లో కదా ఉండమన్నాం. వేళకు వచ్చి భోజనం చేసి వెళ్తాడు. అంతే. అంతమాత్రంలో పొరపాటేముంది? అయినా వెంకన్నబాబుని ఒక కంట కనిపెట్టమని చెప్పాలి. అప్పుడు నేను చదువుకొనే రోజుల్లో పట్టాభిరామయ్యగారింట్లో. వాళ్ల పిల్లలకంటే నాయెడల ఎక్కువ నమ్మకం కలిగి ఉండేవారు. కాని, అప్పటికీ ఇప్పటికీ రోజులు మారిపోయాయి. పిల్లల మాటల్లో నడవడిలో అంతా మరీ మార్పే. అందుకు వాళ్ళనని లాభం లేదు, కాలంతో పాటు మారలేకపోయిన మన అశక్తినే నిందించుకోవాలి.

## — 30-11-45 —

బావగారికి జ్వరం మళ్ళీ తిరగబెట్టిందని టెలిగ్రాం రావడంతో నిన్న రాత్రి బయలుదేరి ఇక్కడకు వచ్చేను. టైఫాయిడు మొదటిమారు వచ్చినప్పటికంటె రెండవమారు వస్తేనే ఎక్కువ ప్రమాదం అంటారు. ఒంటిమీద స్పృహ లేదు; ఏం చెయ్యగలం? అంతా భగవద్విలాసం!

నిన్న రాత్రి రయిలులో చిత్రమయిన సంభాషణ. ఆవిడను నేను పోల్చనే లేదు; అసలు పోల్చడానికి ఇదివరకు బాగా తెలిస్తే కదూ! ఆవిడమాత్రం నన్ను సులభంగానే గుర్తుపట్టింది. మొగమాట పడకుండా పలకరించింది. అప్పటికీ నాకేమో నమ్మకం కలగలేదు, నన్నే పిలుస్తున్నాదని. చిన్నపిల్లల్ని పెట్టుకొని ప్రయాణం చేస్తున్నాది. ప్లాటుఫారం మీద ఏ బండిలో ఎక్కడమా అని ఆలోచిస్తూ ఉంటే ఏమండీ పంతులుగారూ అని పిల్చింది. నన్నని ఎలా అనుకోడం? ఒక్కమారు వెనక్కి తిరిగి మళ్ళీ నడుస్తూ ఉంటే, మిమ్మల్నే మీ పేరు కృష్ణమూర్తి పంతులు గారు కాదూ అంది. బండిలో ఎక్కి కూర్చున్న తరవాత వెనకటి కథంతా చెప్పింది. అనూరాధ స్నేహితురాలట — అప్పుడు జైలునుంచి తిరిగివచ్చినప్పుడు వాళ్ల తమ్ముణ్ణి వెనకాలే పంపించిందిట. అప్పటినుండీ నాపోలిక ఉన్నవాళ్ళెవళ్లయినా కనిపించినప్పుడెలా జాగ్రత్తగా చూస్తుందట. పాపం, స్నేహితురాలంటే ఎంత అభిమానం! పాపం అనూరాధ! ఆమె పొరపాటు ఎంతమాత్రం లేదు. అప్పుడు ఆ దేశభక్తి హుషారు ఆమెని పొట్టబెట్టుకొంది. ప్రత్యక్షంగానో పరోక్షంగానో వాళ్ల సంసార వినాశనానికి కారణం అయింది. ఇప్పుడీమె ఇలా రయిల్లో కనిపించినట్టుగానే పండిపోయిన గెడ్డాలతో బైరాగి వేషంతో వెంకట్రామయ్యగారు కూడా ఒకనాడెప్పుడైనా తారసపడతాడేమో? ఈవిడ శ్యామలాంబ ఎంతో సంతోషించింది: పెళ్ళి చేసుకున్నాననీ పిల్లలు బాగా చదువుకొంటున్నారనీ అంటేను. మరి అనూరాధ ఆత్మకి వ్యథ ఉండదు, తాను చచ్చిపోయేముందు రాసిన ఉత్తరంలో కూడా నేను సుఖపడాలనే రాసిందట. తాను బ్రతికి ఉంటే, మరేవో వికారపు పరిస్థితులు వస్తాయని తాను వెళ్ళిపోయిందట.

మధ్యాహ్నం పడుకొంటే కల. అనూరాధ ఎక్కడికో చరచర లాక్కెళ్లిపోతూంది చెయ్యిపట్టుకొని. వెనకనించి సరస్వతి కేక, ఛతిసంచీ, టిఫిను కారియరూ మరిచిపోయేరు తీసుకొండని. వెళ్లివద్దామంటే అనూరాధ చంటిపిల్లలా ఏడుస్తూ కూర్చుంది. నువ్వు మరి రావు రావు అని. అయితే మరి వెళ్లనులే అని ఎత్తుకొని నడుస్తూ ఉంటే అదంతా సముద్రతీరం — నన్నిలా సముద్రంలో తోసీడానికి చూస్తున్నావా నేను రాను అని మళ్ళీ మామూలు మనిషయి కూర్చొని, కోపం వచ్చిందా, ఇంద వేరుశెనక్కాయలిస్తానంది, ఈ వెధవకాయలన్నీ గుల్లలే — మా ఊళ్లో

అయితే అని నేననడం జ్ఞాపకం ఉంది. ఏ ఊరు మీ ఊరు అంది నాట్యం చేస్తూ? అంతలో ఎవళ్లో మేడ మెట్లమీదనుండి పళ్లెం ఏదో ఎత్తేశారు; ఆ చప్పుడులో మెలకువ వచ్చింది.

సాయంకాలం చూసి డాక్టరు మరేం భయం లేదన్నాడు.

ఇందాకా అల్లుడు వెంకటరమణ చాలా నెమ్మదిగా సబబుగా మాట్లాడేడు. చెప్పినవన్నీ విన్నాడు. అమ్మాయిని ఇంటికి తీసుకొనివెళ్ళిపో మన్నాడు. మరి ఇప్పుడు చదువన్నది సాగేదికాదు, పట్నంవెళ్లి ఏదయినా ఉద్యోగం సంపాదిస్తేనేగాని తిరిగిరానన్నాడు. అన్ని పాడు అలవాట్లూ విడిచిపెట్టేస్తానన్నాడు. ఈ వేడిమీద కొంతకాలం నిలబడినా చాలును. రేపే బయలుదేరుతానన్నాడు. కాని, తండ్రి ఇవతల ఈ స్థితిలో ఉండగా పెద్దకొడుకు వెళ్ళిపోయేడంటే ఏం బాగుంటుంది? నలుగురూ నన్నంటారు. మంచిబుద్ధి కలగగానే పని చెయ్యాలి. నిడివి పడితే నిశ్చయాలు సడలిపోతాయి. బావకు ఏ కొంచెం స్వస్థత చేకూరినా అమ్మాయినీ అల్లుణ్ణీ బయలుదేరదీసి ఇక్కడనుండి తీసుకొని పోవాలి.

## — 14-1-1946 —

ఈ దినచర్య వ్రాయటమనే పని సుమారు నెలా పదిహేనురోజులుగా పడనేలేదు.

ఇవాళ పెద్దపండగ—కాని పండగకళ ఏమీ లేదు. బావగారు పోయి నేటికి సరిగా నెల్లాళ్ళయింది. అక్కడి వ్యవహారాలు ఇంకా అంతుపట్టడం లేదు.

ఇక్కడ ప్రెస్సు పరిస్థితీ అలాగే ఉంది. వెంకన్న బాబు సకాలంలో టెలిగ్రాము ఇచ్చిఉండకపోతే చాలా గొడవ జరిగిఉండును. దుర్గారావు వ్యక్తిగతంగా చాలా మంచివాడే. పీకపోయినా కక్కుర్తి పడడు. ఒక్క క్షణం వృథా చెయ్యడు. అంతా బాగానే ఉంది. కాని, పనిలో బద్ధకం అంటే సహించలేడు. నోరు కూడా మంచిది కాదు. రోజులు మునుపటిలాగ లేవు. పనివాళ్లు కొట్టినా తిట్టినా పడిఉండే పరిస్థితులు లేవు. ఇదివరకల్లా ఏ ఒకరో ఇద్దరో ఎదురు తిరిగితే సర్దుబాటు చేసేస్తే సరిపోయేది. ఇప్పుడలా కాదు; తక్కిన అందరూ ఒకటి, ఇతను ఒక్కడూ ఒకటి అన్నట్టుగా ఉంది. ఉంటే వాడయినా ఉండాలి; లేదా మేమయినా ఉండాలి అంటున్నారు — బైటికి కనపడదుగాని, వీళ్ళకి సోములునాయకుడు. వాడాడించినట్లల్లా తక్కిన వాళ్లు ఆడుతున్నారు. కాని ఇప్పుడేమిటి సాధనం? దుర్గారావు తొమ్మిదేళ్ల వయస్సులో ప్రెస్సులో చేరేడు. నాటినుండి నేటివరకూ పరిస్థితులు ఎలా ఉన్నా, కొన్ని సమయాల్లో రెండుమూడు నెల్లు జీతాలివ్వకపోయినా కనిపెట్టుకొని ఉన్నాడు. అటువంటివాణ్ణి ఒదులుకోడం కష్టమే; పైగా పిల్లలుగలవాడు. ఎక్కడో ఒకచోట ఉద్యోగం సంపాదించలేకపోడుగాని తన బ్రతుకే పోయినట్టుంటుంది ప్రెస్సునుంచి పొమ్మంటే — ఇక తక్కినవాళ్లూ చాలా పట్టుదలగానే ఉన్నారు. ఒక్క దుర్గారావుకోసం వాళ్లందర్నీ వదులుకొంటే ప్రెస్సు సుమారుగా మూసిపెట్టినట్టే—

ఏం చెయ్యడం? దుర్గారావుని బ్రతిమాలితే పొరపాటయిపోయిందని ఒప్పుకొంటాడు. కాని, తనుండగా తక్కినవాళ్లుంటారా? లేకపోతే వెంకన్నబాబుకూడా ముసలివాడయిపోయేడు, దుర్గారావుని షాపులో కూర్చోమంటే! ఏమిటో, ఏమీ తోచకుండా ఉంది. ఇదంతా రేపటెల్లుండిలో తేల్చుకొని మళ్ళీ అక్కడకు వెళ్ళాలి. ఆయన అంత ఆర్జించేడని అనుకోడమేగాని, చివరికి మిగిలేదేమీ లేనట్టుంది. అంతా గందరగోళంగా ఉంది.

## — 2-2-1946 —

శాంతనూ పిల్లలనూ ఇక్కడకు తీసుకునిరావడం పొరపాటే అయినట్టుంది.

అక్కడ ఇల్లమ్మేసినతరవాత, వేరే చిన్న ఇంట్లో అద్దెకు ఉండడం ఏం బాగుంటుం దని తీసుకొని వచ్చేను. కాని, ఇక్కడ ఇంట్లో నానా గలభాగానూ ఉంది. మధ్యాహ్నం భోజనానికికూడా ఇంటికి రావాలనిపించడం లేదు. మేడ బద్దలయేలాగ చప్పట్లు, అస్తమానం కిందికీ మీదికీ వెళ్తూ ఉండడం పెద్దగోల పెట్టి ఒక్కళ్ళనొకళ్లు పిల్చుకొంటూ ఉండడం; ఏవేవో అర్థపర్థం లేని గొడవలు, వాదనలు.

శాంత ఏమిటో ఇలా తయారయింది. అక్కడ వాళ్ళింట్లో తనగదిలో పరధ్యానంగా కూర్చున్నట్టే, ఇక్కడ పెరట్లో సంపెంగచెట్టు నీడను సిమెంటు బెంచీమీద కూర్చుంటుంది రోజంతా! ఏదయినా వ్యవహారం గురించి చెప్తే, ఒకంతట బోధపడినట్టే ఉండదు. గట్టిగా నిలవదీసి. అడిగితే, "నాకేం తెలుసు నన్నయ్యా నీకెలా బాగుంటుందంటే అలా చెయ్యి" అంటుంది. ఇక పిల్లలు, వాళ్లకు తండ్రి

పోయాడనే కించ ఉన్నట్టు లేదు. అధమం తమస్థితి ఏవిధంగా మారింది, ఏవిధంగా నడుచుకోవాలి? మునపటిలాగ ఖర్చులు పెట్టాలంటే డబ్బెక్కణ్ణించి వస్తుంది అన్నరకం ఆలోచనలో ఉన్నట్టు లేరు.

— 3-2-1946 —

పట్టాభి రామయ్యగారి పౌత్రుడు పరారీ అయాడు, పాతికరూపాయిలున్న మనీపర్సు, రెండు ఫౌంటెన్ కలాలు, ఒక పాతరిస్టువాచీ ఒక ఉంగరం, రెండు చిన్న వెండిగిన్నెలతో సహా. ఇంట్లో అందరికీ పోనీ ఇంతతోనయినా ఈ శని విరగడయింది చాలునని ఉంది. శరత్ స్కూల్లో కనుక్కొన్నాడట. పేరు తేసేసి మూడు నెలలు పైగా అయిందిట. ఈ మూడు నెల్లలోనూ నాదగ్గరా, ఇంట్లోనూ ఎన్ని మార్లు స్కూలుజీతానికని పుచ్చుకొన్నాడో—తెలిసీ తెలియనట్లు ఊరుకోడంవల్ల వచ్చినస్థితి ఇది. అసలు పోయిన వస్తువులింతేనా, ఇంకా మరేవయినా ఉన్నాయో? ఆ మధ్యను చిల్లరవస్తువులు బట్టలూ ఇటువంటివి కనబడకపోతే పనిమనుషులమీద కేకలువెయ్యడం జరిగింది. కాని, వాటన్నిటికీ వీడే కారకుడయి ఉంటాడు. ఇటువంటివాణ్ణి గురించి పోలీసుకు రిపోర్టు ఇచ్చి మాత్రం ఏమిఫలితం. అయినా వీడు ఇంతటితో విడిచిపెట్టడం విశేషమే. చెల్లెమ్మగారి పిల్లలు బహు అజాగ్రత్త మనుష్యులు. వాళ్లవి ఏ గాజులో గొలుసో సంధించేడంటే ఇంత తేలికగా ఊరుకోలేము, మానలేము.

ఆంధ్ర ప్రాభవం కవిగారికి రేపు మళ్లీ రాయాలి. పని పూర్తయిపోయింది. ముందుగా పుస్తకాలు పంపిస్తే అసలే డబ్బివ్వడేమో? అస లిప్పుడీ పుస్తకాలు తీసుకొనే స్థితిలో ఉన్నాడో లేదో ఆయన. ఈమా రిటువంటి మొగమాటం వ్యవహారాలు లాభం లేదు. ఎంతడబ్బుకి అంతపనే చెయ్యాలి, అంతేకాని చేతిచమురు భాగవతం కాకూడదు.

— 8-2-46 —

మధ్యాహ్నం భోజనం అయిన తరవాత విశ్రాంతి తీసుకొందికి కూడా వీల్లేనంతగా ఉంది ప్రెస్సుపని. దుర్గారావు చాలా పట్టుదలతో రోజంతా పనిచేస్తున్నాడు. అతను తెచ్చిన కుర్రవాళ్లుకూడా తమ స్వంతపని అన్నట్టు చేస్తున్నారు. మునుపు పది పన్నెండుమంది పెద్దవాళ్ళు చేసేపని ఇప్పుడు దుర్గారావూ ఈ ఆరుగురు కుర్రవాళ్ళూ అతి తేలికగా చెయ్యగలుగుతున్నారు. దేనికయినా ఉత్సాహమూ పట్టుదలా ఉండాలి.

సుమారు పదిరోజులయింది, రాత్రి భోజనం అయేక తాంబూలం వేసుకొని, ఇలా ఈ చెరువు గట్టుకు వచ్చి కూర్చోడం. పదిగంటలవరకూ ఇలా కూర్చొనివెళితే వెంటనే బాగా నిద్రపడుతూంది. ఫిబ్రవరి వచ్చినా చలి ఇంకా ఉన్నానంటూనే ఉంది.

ఇన్నాళ్ళకు కాబోలు, కాస్త అస్వస్థగా ఉందని వెంకన్నబాబు మధ్యాహ్నం షాపుకి వెళ్లడం మానేసి పడుకొన్నాడు. వయస్సు ఎనభై దాటి ఉంటుంది. కాని, ఇప్పటికీ చాలామందికంటె బాగా నడవగలడు, దృష్టిలోపం లేదు. పుష్టిగా కాకపోయినా శుభ్రంగా తినగలడు? తిన్నది జీర్ణంకాదనే బాధలేదు. ఎన్ని లక్షల ఆస్తిఅయితే సరితూగుతుంది అటువంటి వజ్రసన్నిభమయిన శరీరసంపదతో.

— 14-2-46 —

ఉదయం ప్రెస్సులో ఉండగా టెలిగ్రాము అల్లుడిదగ్గరనుండి. ఉద్యోగపు ధరావతు మూడు వందలు. తక్షణం పంపించాలి.

మూడు వందలు—సిద్ధంగా ఎక్కడనుంచి వస్తాయి. అమ్మాయి తన గొలుసు అమ్మేసి పంపించమంది. దానికి ఉన్నది అది ఒక్కటే—అసలు సరస్వతికి డబ్బు పంపించడమే ఇష్టం లేదు. ఇదివరకులాగే ఇదీ ఒక గమ్మత్తే, ఏదో ఖర్చు పెట్టడానికయి ఉంటుం దంటుంది. కాని, ఎలా ఊరుకోడం. ఇన్నాళ్లకు అతడేదో దారిలోపడి ఉద్యోగమే సంపాదించి ధరావతు కట్టవలసివస్తే, ఆమాత్రానికి వెనుదియ్యడంవల్ల ఏమవుతుందో, అతడికి కోపంవచ్చి ఏంచేస్తాడో. ఇలా తటపటాయించటంతోనే రెండు మూడు గంటలయిపోయింది. చివరికి సరస్వతి వడ్డాణం తాకట్టుపెట్టి, డబ్బు తేవడం జరిగింది. టెలిగ్రాం మనియార్డరు కట్టబోతూఉంటే అమ్మాయే వచ్చి అంది. పోనీ అమ్మకి అంత అనుమానంగా ఉంటే, తమ్ముడు వసంత్ ని పంపించకూడదా? వాడికీ మద్రాసు తిరిగి రావాలని చాలా సరదాగా ఉందన్నాడు అంది. వాడి ఖర్చులకి మీరు డబ్బివ్వక్కర్లేదు నాదగ్గర ఉంది ఇస్తానంది. మొత్తానికి అదేమంచి దనిపించిం దందరికీ. వసంత్ వెళ్ళి ముందుగా డబ్బు తేలేదని చెప్పి, అసలు అక్కడి పరిస్థితి ఏమిటో, అవసరం నిజమైన దవునో కాదో తెలుసుకుంటాడు. ఆపైన నిజమయిన అవసర

మనిపిస్తే బావమరిది హాస్యం అని చెప్పి డబ్బిస్తాడు. లేదా, చల్లగా తిరిగి వస్తాడు.

— 17-2-46 —

వసంతుడిదగ్గరనుంచి టెలిగ్రాము: ఉద్యోగం నిజమే. ధరావతు కట్టేశాము అని. సరస్వతి మొగంలో ఇన్నాళ్ళకు కళకళ కనిపించింది. ఎంతజీతమో ఏమిటో? ముగ్గురు పిల్లలు, వీళ్లు సంసారం ఎలా ఈదుకొని వస్తారో? వచ్చే సంవత్సరం వీళ్ళంతా పై చదువులకి వెళ్లాలంటున్నారు. అంతా ఒక దగ్గరుంటే మనం పంపేది కాస్తా వేణ్ణీళ్ళకి చన్నీళ్ళు తోడన్నట్లుంటుంది. ఒక్కొక్కళ్లు వేరవేరే హాస్టల్సులో ఉండడమంటే సాధ్యమయేపని కాదు.

వెంకన్నబాబు మళ్ళీ మునపటిలాగ ఇవాళ రెండుపూటలా షాపుకి వెళ్లాడు.

అంత స్తబ్దులాగ కూర్చునే శాంతలోనూ కొంత ఉత్సాహం కనిపించింది కొడుకు ఉద్యోగస్థుడయేడంటే. ఆయన చాలామార్లు అంటూఉండేవారు, మద్రాసు, కలకత్తా ఢిల్లీ అన్నీ తిరిగి వద్దామని. ఎప్పుడూ వెళ్ళడం అయింది కాదు. ఇప్పుడు వీడి మూలంగా తిరగవలసి వస్తుందికాబోలు అంది. అది సంతోషమో విచారమో ఏమిటో దానికే తెలీదు.

దుర్గారావంటాడు: ఊళ్లోకి ఎలక్ట్రిసిటీ వచ్చింది కదా పాత ప్రెస్సు అమ్మేసి పవరు ప్రెస్సు తెప్పిద్దామంటాడు. ఇది అనుకొన్నంత సులభంగా అయేపనా? మనం అమ్మేదానికి సగానికి సగం విలువరాదుగాని, కొనేదానికి మాత్రం పూర్తి ఖరీదు చెల్లించాలి. ఇక పవరు ప్రెస్సు పెడితేమాత్రం ఇప్పటికంటె పని ఎక్కువ వస్తుందని హామీఏమిటి? అప్పుచేసి డబ్బు తెచ్చి దానిమీద పెట్టేకంటె ఈ ఉన్నదాన్తోనే ఎలాగో బండి ఈడ్చుకుపోడం మంచిదికాదా? కాని దుర్గారావు మాటలోనూ కొంత నిజం లేకపోలేదు, పూర్వం మన ప్రెస్సుకంటె ఎంతో తక్కువగా ఉండినవాటిలో కొత్తకొత్త మెషీనరీ తెప్పిస్తున్నారు. పవరుతో నడిపే యత్నాలు చేస్తున్నాను. ఈ సమయంలో మనం వెనకబడితే, ప్రస్తుతపు పేరు ప్రతిష్ఠలు సన్నగిలిపోతే తరవాత అసలే దెబ్బతినవలసి వస్తుంది. కాని, దుర్గారావు చెప్పిన లెక్కలని బట్టిచూస్తే అథమం ఆరువేలయినా కావాలి. సరస్వతి బంగారం అంతా అమ్మినా ఇప్పటి హెచ్చుధరల్లోనయినా నాలుగువేలకంటె ఎక్కువరాదు; తక్కినది ఇంటిమీద వాడాలి; లేకపోతే శాంతనడిగితే, తాను కాదనదుగాని, నలుగురూ నాలుగు రకాలుగా అనుకొంటారు. వాళ్లడబ్బు ముట్టుకోక పోడమే మేలు.

పిల్లలచదువులు, వాళ్ల పిల్లలచదువులు—వాళ్లది మిగిలినదంతా నాలుగువేల చిల్లర—తక్కినదంతా ఊళ్ళోని చిల్లరమల్లర బాకీలకే సరిపోయింది—బట్టల కొట్టువాడికి పద్దెనిమిదివందలు, కాఫీహోటలుకి మూడువందలయాభై, కిరాణా దుకాణంవాడికి పధ్నాలుగువందలు, లెక్కా పత్రంలేని అప్పులు. ఇక్కడా వాళ్ల పిల్లలు అక్కడి అలవాటు చొప్పున వెళ్ళి బట్టలూ అవీ నా పేరుచెప్పి తీసుకొంటున్నారేమో? వీరభద్రస్వామిగారికీ వాళ్లకీ చెప్పెయ్యాలి.

— 20-2-46 —

ఇవాళ ఉదయం ప్రెస్సుకి వెళ్తూంటే శరత్ కూడా బయలుదేరేడు. కొంచెం మేర నడిచిన తర్వాత చెప్పేడు—ఈ ఇల్లు అడివిలా ఉందినాన్నా, ఇక్కడుండి మరి మేం చదువుకోలేం అన్నాడు. వాడిమాట అనగానే కోపం వచ్చిందిగాని, తరవాత ఆలోచిస్తే అందులో పొరపాటేమీ లేదనిపించింది. వాడన్నమాట నిజమే, ఈ గొడవలోఉండి చదివితే వాళ్లకు క్లాసురావడంమాట అటుండగా అసలు పాసు కావడమే కష్టం. ఎవళ్ళేమనుకొంటే అనుకోనీ; ఈ రెండునెల్లూ వాడూ హేమ వేరే బస తీసుకొని ఉంటామన్నారు. కూడా వెంకన్నబాబు ఉంటాడు. భోజనాలకి మాత్రం ఇక్కడికి వాళ్లెందుకు రావాలీ; హోటలునుంచి తీసుకొని వెళ్లినట్టు పనిమనిషి పట్టుకెళ్లి ఇచ్చేస్తుంది. కావాలంటే వెంకన్నబాబు ఇంటికి వచ్చి భోంచేస్తాడు.

వసంతుడి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. రెండుమూడు రోజుల్లో బయలుదేరి వస్తున్నానని. ఈ సంవత్సరం వాడు చదువు మానివేయడమే మంచిదయింది. ఆరోగ్యం బాగుపడింది. మళ్ళీ సంవత్సరం అందరూ కలిసి చదువుకి వెళ్లవచ్చును.

— 5-4-46 —

ఇవాళ మధ్యాహ్నం మేనల్లుడు గోపాలమూ వాళ్ల చెల్లెలు శశిరేఖ కలిసి పెద్దగొడవ లేవదీశారు—నేను కలకత్తా ఢిల్లీ బొంబాయి తిరిగివస్తాను నాకొక మూడు వందలు కావాలంటాడు. ఎలాగూ మళ్ళీ సంవత్సరం చదువులకీ వాటికీ బోలెడవుతుంది. ఇప్పుడెందుకు బాబూ ఇంత ఖర్చు అంటే వినడు. మా నాన్నగారయితే నేనెంత అడిగితే అంత ఇచ్చేవారంటాడు. ఏమిటో నేను వాళ్ల డబ్బు నా స్వార్థంకోసం

దాచిపెట్టుకొని ఉంచుకొన్నట్టుగా. వాడికి మద్దత్తు శశిరేఖ. ఈమధ్యను అది కొంటానన్న సిల్కుచీర కొనవద్దన్నానని దాని కోపం. నెమ్మదిగా చెప్పడానికి వీలయినంతా చెప్పాను. మీ నాన్నగారున్నప్పుడు ఖర్చుపెట్టేవారంటే, ఆయన నెలకు రెండు వేలు తెచ్చేవాడు, ఎంత తెచ్చేవాడో, అంత ఖర్చు పెట్టేవాడు. ఇప్పుడంతా కావాలంటే ఎలా వస్తుందంటే వినరు. నేను, వీళ్లందరిలోకీ వెంకటరమణ ఒక్కడే తెలివితక్కువవాడు, మొండిపట్టుదల గలవాడు అనుకున్నాను కాని, వీళ్ళూ అంతే. అయితే స్కూలు చదువులో వాడికంటె కొంత నయం. వాడు ఇంటర్మీడియేటులో ప్రవేశించి మానేసేడు; వీళ్లు దండయాత్రలు చేస్తున్నా చదువు మాత్రం మానలేదు. అంటే గడుసువాళ్ళన్నమాట. చదువుపేరుచెప్తే పెద్దవాళ్ళదగ్గరనుండి సులభంగా డబ్బు వసూలవుతుంది. ఈ చిన్నవాళ్లతో తెలిసిన ఘోషా కాదు తెలియనిఘోషా కాదు; అప్పుడు వెంకటరమణ వైరు చెయ్యగానే మూడువందలూ పంపించలేదా అంటాడు. వాడేదో చెడుదారిబట్టిన వాడు దారోపడి, ఉద్యోగం సంపాదించుకొని, ధరావతుకింద డబ్బు కావాలంటే పంపించాను. అందులోనూ వాళ్లడబ్బు ఒక దమ్మిడీలేదు. ఆమాట చెప్పినా వాళ్ళకి బోధపడదు. వాడేమో నా అల్లుడు కదా అని ప్రత్యేకించి చూస్తున్నానట!

శాంతతో చెప్పినా ఫలితం లేకపోయింది. నాకేం తెలీదన్నయ్యా, నీయిష్టం, ఎలాచేస్తే అలా చెయ్యి. చెడిపోయేవాళ్లను బాగుచేసేవాడెవడు? వాళ్లిష్టం వచ్చినట్టు తగలబెట్టుపోనీ అంది. అంతచక్కగా మాట్లాడిన మనిషి తరవాత మాటలకి మరి తిన్నటి సధానం చెప్పదు. నాకేం తెలియదన్నయ్యా; వాళ్లకి బుద్ధిపుడితే వదిలేరకంకాదు — ఎంతో కొంత ఇచ్చి పొమ్మనకూడదా అంటుంది.

ఆడపిల్లలపెళ్ళిళ్ళు కావాలి; ఇంకా చదువులు కావలసినపిల్లలున్నారు. పెద్దవాళ్ళ చదువులయినా సరిగాపూర్తికాలేదు. అక్కడి భూములవ్యవహారం తలా తోకా లేకుండా ఉంది. అందువల్ల ఎంత వస్తుందో? అదయినా కోర్టుకివెళ్తేనేగాని తేలేట్టు లేదు. అయినా ఇంత ఆర్జించుకొని ఒక పాతికవేలయినా మిగుల్చుకోలేకపోడంకంటె దురదృష్టం ఇంకేముంటుంది?

చివరికి రెండువలయాభైఇస్తే సర్దుకుంటామన్నారు గోపాలం శశిరేఖాను. రేపు బేంకులోది తియ్యాలి; ఇదే మొదటిమారు తీయడం. ఈరకంగా తియ్యడం మొదలుపెడితే అట్టే కాలం మరి బేంకు ఎకౌంటు అవసరం ఉండదు. ఇంతకంటె వాళ్ళ వ్యవహారాలు వాళ్లకే అప్పజెప్పేస్తే కొంతబాధ్యత ఉంటుందేమో? లేక, ఒక్క నెల్లాళ్ళలో శాంతచేత బలవంతంగా సంతకాలుచేయించి డబ్బు ఊదేస్తారేమో?

ఈవేళకయినా వెంకటరమణ దారిలో పడడం కొంతినయం. లేకపోతే వీళ్లు సామాన్యులు కారు. అల్లుడిఖర్చులకీ, అల్లుడిపేరుతో నేనూ డబ్బు అపహరించామంటారు.

దుర్గారావు అప్పుడే నాలుగురోజులయింది ప్రెస్సుకి రాలేదు; ఏదో అజీర్ణ జ్వరం అని అశ్రద్ధ చూపి లాభంలేదు. రేపు డాక్టరుని తీసుకొనివెళ్ళి చూపించాలి.

పిల్లలు తప్పటడుగులు వేస్తూ ముద్దుమాటలాడుతూ ఉంటే వాళ్లభవిష్యత్తుగురించి ఎన్నో కలలుకంటాము— నిజంగా అదే ఎక్కువ ఆనందమయిన స్థితేమో? ఇప్పుడిలా ఎదురుతిరిగి అసందర్భంగా మాట్లాడుతున్న ఈ మేనల్లుళ్లు మేనకోడళ్లు ఎంత ముద్దుగా ఎంత ఆశాజనకంగా ఉండేవారు! వాళ్ళ ముందు మా పిల్లలు బలహీనంగా నిరుత్సాహంగా ఉన్నట్టుండేవారు. ఇప్పుడు చదువుల్లో వీళ్లకీ వాళ్ళకీ సాపత్యమే లేదు. ఇకముందెలా ఉంటుందో?

— 8-4-46 —

దుర్గారావు స్థితి చాలా ప్రమాదంగా ఉంది. మనిషి ఉండి ఉండి పలవరిస్తూఉంటాడు ప్రెస్సులో మాట్లాడుతున్నట్టే. పాపం అంతా చిన్న పిల్లలు. మొదటి పెళ్ళాం పిల్లలు లేకుండానే పోయింది. భగవంతుడు అతనిని కాపాడాలి తప్ప, లేకపోతే అతని భార్యకీ పిల్లలకీ అడుక్కోడమే శరణ్యం. పాపం ఇన్నాళ్ళు ప్రెస్సుకింద తన జీవితం ధారపోశాడు; ఇప్పుడు ఒక్క నెల్లాళ్ళపాటు జీతం రాకపోతే బతకలేని స్థితిలో ఉన్నాడు. అతని స్థితే కాదు, నా స్థితీ అలాగే ఉంది: ఈనాడు ప్రెస్సు పడుక్కొంటే ఏమవుతుందో చెప్పలేను—అంతగా ఆర్జించినవాడు బావగారు, ఆయన పోయేసరికే కుటుంబం నిరాధారం అయిపోయిందికదా! ఏమిటో మనస్సు ఏమీ బాగుండలేదు. సాయంకాలం వేగం ఇంటికి వచ్చేను. కాని, వచ్చేసరికల్లా, సరస్వతికి జ్వరం. డాక్టరు వచ్చి చూసి, మామూలు జ్వరమే రేపటికల్లా తగ్గిపోతుంది అని మందిచ్చి వెళ్లాడు.

# :శిశిరం:

భగవద్గీత—పజిల్సు — భారతం — ప్రకృతి చికిత్స—ఇవి రోజూ మాబాతాఖానీ సామగ్రి.

ఉదయం రోజూ ఇదివరకు లైబ్రరీకి వెళ్ళి కూర్చునేవాణ్ణి. ఈమధ్యనంతా మూర్తి బుక్ స్టాల్ లో గడిచిపోతూంది.

బుద్ధుడు మహర్షులతో కలిసి తపస్సు చేసి, అరణ్యాలలో శరీరాన్ని శుష్కింపజేసి ఇంకా బహువిధాల పరిశ్రమించి పొందలేని మానసికశాంతిని ఒక మర్రిచెట్టునీడను ఒంటరిగా కూర్చుని పొందగలిగేడు. అలాగే ఆరునెలలపాటు దేశమంతటా తిరిగి తిరిగి పొందలేని శాంతి నాకు ఈ చిన్నపుస్తకాలషాపు యజమాని కృష్ణమూర్తిగారిసమక్షంలో లభించింది.

సామాన్యంగా బేరంఉన్నా లేకపోయినా షాపు యజమానుల దృష్టి వచ్చిపోయే వారిమీద ఉంటుంది—ఈ తెల్లచొక్కామనిషి, లేదా ఆఖద్దరు వాణీమనిషి మన షాపులోకి వస్తాడేమో, వస్తే ఎటువంటిపుస్తకాలు కావాలంటాడు? మొదట అక్కరలేదనుకొన్నవాటిని కావాలనిపించేలా ఎలా చెయ్యడం? ఇలా ఏదో దారినిపోయేవాళ్ళనుగురించి ఆలోచిస్తున్నట్టుంటారు. కాని, కృష్ణమూర్తిగారికి ఎప్పుడూ తను చదువుతున్న పుస్తకమో రాస్తున్న కాగితమో తప్ప తక్కిన ప్రపంచంఘోషే ఉండేదికాదు.

నిజంగా నాకు తెల్లకాగితాలు కొనడం అవసరం అనిపించింది. అతనిషాపులో ప్రవేశించానో, లేక అతనిషాపులో ప్రవేశించి బాతాఖానీ కొట్టడానికి మిషగా కాగితాలు కావాలన్నానో నాకే తెలీదు. ఆయన తను చదువుతున్న భగవద్గీత పుస్తకంలోనుంచి తల ఎత్తకుండానే "తెల్లకాగితాలా? ఇస్తాను, కూర్చోండి" అన్నాడు. నాకు నిజంగా కూర్చోవాలని ఉందని తానెలా కనిపెట్టాడో లేక అది ఆయనకి సహజమేమో? అయితే ఆయనగాని అందరు పుస్తక విక్రేతలలాగే వెంటనే కాగితాలిచ్చి పంపించివుంటే ఏమీ లేకపోయేది.

మా మొదటి సంభాషణమాత్రం కొంచెం ఎగుడు దిగుడుగానే నడిచింది.

బేరంకంటే భగవద్గీతా పారాయణమే ఎక్కువ ప్రధానంగా ఆకర్షణీయంగా ఉన్నట్టుంది తమకి.

మాదగ్గరికి వచ్చేవారు ఒకటి రెండు నిమిషాలు ఆలస్యానికి మరొకచోటికి పారిపోయేవారు కారు.

లేకపోయినా మీకు భగవద్గీతా పారాయణలో అంత ఆసక్తి ఉన్నట్టుంది. ఏ అధ్యాయం చదువుతున్నారేమిటి?

ఏమిటి మీకూ కొంత ఇష్టం ఉన్నట్టుంది భగవద్గీతంటే.

ఇష్టానికేముంది? పనీపాటలేనివాళ్ళకి నల్లమందులాటిది వేదాంత చర్చ. అయితే ఇంతకీ మీది ఏ సంప్రదాయం? ద్వైతమా అద్వైతమా ఏది సుఖం మీకు?

ఆ పూటంతా వాదప్రతివాదాలతోనే గడిచిపోయింది. ఆయన అన్నదానికల్లా విరుద్ధంగా మాట్లాడడమే నా పనిగా పెట్టుకొన్నాను. అసలిటీవల ప్రపంచం అంతటితోనూ ఎదుటి పార్టీకి చెందినట్టుగానే అనిపించిది. అయితే కృష్ణమూర్తి పంతులుగారి ఓరిమిమూలంగా కొంతసేపటికి రాజీమార్గానికి వచ్చేము.

మధ్యాహ్నం పన్నెండు గంటలు దాటింది మేము లేచేసరికి. ఆయనే జ్ఞాపకంచేసేడు తెల్లకాగితాలమాట! ఏరకంవి కావాలి, ఎటువంటిపనికి ఉపయోగించేవి? నాకు ఒక నిశ్చయం ఉంటేకదూ?

విడికాగితాలకంటె శుభ్రమయిన నోట్ పుస్తకమయితేనే బాగుంటుందేమో? అసలిప్పుడు ఏమిటి రాయబోతున్నానో నాకే నిశ్చయంగా తెలియదు. అంచేత ఎప్పుడు ఏదిరాయాలని బుద్ధిపుడితే అది రాయడానికి తగినట్టుండాలి.

అలా అయితే, ఎందుకు, నిరుడు తెప్పించిన డైరీలలో ఒకటి ఉండిపోయింది ఖర్చుకాకుండా! అది తీసుకోండి, ఆ మధ్యను నేనే దాన్ని ఉపయోగిద్దామనుకొన్నాను, గాని, చదవడానికి రాయడానికి తగిన ఓపిక లేకుండాఉంది. ఈ మధ్యను నేను ఏమయినా రాస్తున్నానంటే అది పజిల్సు నింపడమే.

అంటే అటు భగవద్గీత ఇటు పజిల్సు అన్నమాట? చాలా బాగుంది—మొన్నటిదాన్లో 'లక్కా' 'లాక్కా' ఏది వేసేరు?

రెండూ వేసేను. అయిపోయినదాని మాటకేం ఇప్పటిదానికి ఎన్ని పంపిస్తున్నారు?

పజిలు సాల్వ్ చెయ్యడంవరకే నా సరదా! ఆపైన మరి లేదు. అలాగని మనం పంపించిఉంటే ఎన్ని తప్పులు వచ్చిఉండును అన్న ఆ తాపత్రయమూ లేదు.

అంటే మీది నాకంటె పైఅంతస్థు అన్నమాట! నాకింకా అంతటి నిర్మోహత్వం రాలేదు; ప్రతిమారూ మూడుకంటె ఎక్కువ కాకుండా పంపిస్తున్నాను. అయితే మీరు చెప్పినట్టు కీ సొల్యూషను ఎప్పుడు వస్తుందా అని బహుమతుల జాబితా ఎప్పుడు ప్రచురిస్తారనీ ఆ హడావిడి మునుపు ఉండేది; ఇప్పుడు క్రమంగా బాగా తగ్గిపోయింది. మీరు స్వయంగా ఎలాగూ పంపించడం లేదు కదా! సాయంత్రం ఒకమారు వస్తారేమిటి? నేను తయారుచేసిన సొల్యూషను చూద్దురుగాని.

సాయంకాలం నేను వెళ్ళడమయితే జరిగిందిగాని, మేము చర్చించినదంతా ఆటంబాంబు మొదలయిన మారణాయుధాలపాటవాన్ని గురించే—

* * * *

అయితే మూర్తిగారూ! పుడుతున్నాం, పెరుగుతున్నాం, చస్తున్నాం—ఇక్కడికింతేనా? ఆతరవాత మరి ఏమయినా ఉందా? ఉంటే ఏవిధంగా ఉంటుంది? అప్పుడుకూడా మనకు ఉండే సుఖదుఃఖ రూపకమయిన అనుభవం ఉంటుందా?

వీటన్నిటికీ సమాధానాలు నేను చెప్పినంతలో మీకు తృప్తి కలుగుతుందా?

సరిగా చెప్పితే ఎందుకు కలగదూ? అయినా మీరు నాకంటె ఎక్కువగా లోకాన్ని చూసినవారు.

ఇటువంటి అంశాలలో వయస్సూ అనుభవమూ మాత్రమే ఉపయోగించవు. కొందరు ఎంత వయసు వచ్చినా చిన్నపిల్లల మనస్తత్వంతోనే ఉంటారు. ఇంతకీ ఈ సంశయాలు ఈనాడు మనకి మాత్రమే కలిగినవి కావు; మనతోనే ఆగిపోయేవి కావు; జనన మరణాలంటూ ఉన్నంతకాలం, చైతన్యపూరితమయిన మానవమేధ అన్నది ఉన్నంతకాలం ఈ ప్రశ్నలూ ఉదయిస్తూనే ఉంటాయి; వీటికి సమాధానాలుగా కూడా ఏవేవో ఊహలూ వస్తూనే ఉంటాయి.

మీరేవో పెద్దపెద్ద సంగతులు చెప్పి నా ప్రశ్నని దాటేస్తున్నారు. అధమం ఈ అంశాలలో మీరేమనుకుంటున్నారో తెలియజెయ్యాలి.

మనం ఏమనుకోడానికీ ముందు మనకి ఒక అశంలో సమన్వయం కుదరాలి; పునర్జన్మ ఉందా లేదా? ఉంటేకూడా వెనకటి జన్మల మంచిచెడ్డల మొత్తపు ఫలితం అంతా ఒక జన్మమీద ఉంటుందా? భగవద్గీతని బట్టిచూస్తే మనం చేసే సదసత్ కర్మలని బట్టి మనకి ప్రాప్తించే జన్మఉంటుంది.

భగవద్గీతనిబట్టి, మరొక మహాగ్రంథాన్నిబట్టి ఇలాగ అలాగ అనకండి; ఈ శరీరం ఈ మనస్సు—ఇవి పరస్పరం మెలివడిఉన్నాయి. శరీరంతో పాటు మనస్సు అంతరించిపోతుందా? లేదంటే అందుకేమిటి ఆధారం? ఇంద్రియాలకి అతీతమయినది మనస్సు, మనస్సుకి పరమందుండేది బుద్ధి, బుద్ధికి పరమందుండేది ఆత్మ—ఆ ఆత్మ శుష్కింప జేయబడదు, నశింప జేయబడదు, అస్త్రశస్త్రాలు దీన్ని బంధించలేవు—ఇటువంటి సమాధానాలవల్ల తృప్తిలేదు.

పోనీ ఇంకొకలాగ చూడుబాబూ! మనం ఏదో రయిల్లో ఒక్కమారుగా కలిసి మళ్ళీమళ్ళీ కలుస్తామని నమ్మకంలేని మనుష్యులదగ్గరకూడా మన స్వభావాన్ననుసరించి మంచివాళ్ళుగానే ఉండాలని ప్రయత్నిస్తాం. మనలను గురించిన వాళ్ళ జ్ఞాపకాలు మంచివిగా ఉండాలనే కదా మనకోరిక. అలాగే జీవితం మొత్తంమీదకూడా మనలను గురించిన ఇతరుల ఆలోచనలు—వాటినే మనం కీర్తి ప్రతిష్ఠలంటున్నాం—మంచివిగా ఉండాలనే ప్రయత్నం చేస్తాం; ఇంతతో మరేమీ లేకపోయేమాటయితే, మనకీ తాపత్రయం అంతా ఎందుకు?

పోనీ మీమాటే ఒప్పుకొందాం. కాని, పునర్జన్మ అన్నది ఉన్నా, దానికీ ఈ జన్మలోని మంచిచెడ్డలకూ ఏమిటి సంబంధం? చాలా మంచిపనులూ, ధర్మకార్యాలు అని పేరుపడినవి అంత హృదయపూర్వకమయినవీ, ధర్మైకదృష్టితో చేయబడినవీ కావని తేల్తుంది కదా! ఈ మిశ్రమమంతటికీ ఫలితం ఏవిధంగా ఉంటుంది?

ఫలితమూ మిశ్రమంగానే ఉంటుంది.

మాట చెప్పడం సులువే. కాని, ఇందువల్ల మన సందేహాలు ఏమయినా తీరేయా? మనం ఎంత మంచిచెడ్డలమాట చెప్పుకొన్నా ఒక మహా మారణాయుధ ప్రయోగఫలితంగానో, ఒక ఉప్పెన,భూకంపం ఫలితంగానో ఒక ప్రాంతం అంతా నేలమట్టమయి పోవలసివస్తుందే. వాటన్నిటికీ వ్యక్తుల గుణదోషాలూ పాపకర్మలే కారణమంటామా? ఈ సృష్టి అంతా సక్రమంగా ఒక నిర్ణీతపథంలో, సర్వశక్తిమంతుడూ సర్వసాక్షీ అయిన ఒక,...ఫలానా అని నేననను, ఆ చేతిక్రింద నడుస్తున్నప్పుడు ఇటువంటి పొరపాట్లు ఎందుకు సంభవించాలీ? వీటివల్ల సాధించబడిన మంచి ఏమిటి? మానవుల మనస్సులలో,వీటివల్ల కలిగిన భయం మూలంగా సత్పరిణామం కలిగిందంటామా?

కలిగిందనే ఒప్పుకోవాలి; అంతటి వినాశనానికి కారణభూతమయిన (భారత) కురుక్షేత్ర సంగ్రామం వల్ల ధర్మం నిలబెట్టబడిందంటున్నాముకదూ!

భారత సంగ్రామంలో ఒకటి పూర్తిగా ధర్మపక్షమనీ ఇంకొకటి పూర్తిగా అధర్మపక్షమనీ కేటాయించబడింది. అక్కడికీ ధర్మపక్షంకూడా అంతిమ విజయం సాధించినప్పటికీ, ఎంతెంతో నష్టాన్ని భరించవలసివచ్చింది. గెలిచిన పక్షానికి మిగిలినదల్లా యుద్ధ నిహతులకు కర్మ చెయ్యడమే.

నిజమే, అంతవరకూ అజ్ఞాతుడుగా ఉంటూ వచ్చిన కర్ణుడితోసహా.

భారతయుద్ధం కేవలం దాయాదుల మధ్య జరిగింది. నేడు వేర్వేరు దేశాలమధ్య జరిగే యుద్ధాలను ఏమనుకోడం? ఏది ధర్మపక్షం? ఒకే యుద్ధాన్ని ఒక జాతి, తమ బానిసత్వ విమోచనకు చేస్తున్న ధర్మప్రధానమయిన స్వాతంత్ర్యసమరం అంటుంది; మరొక జాతి, అనాగరకజాతుల కడగండ్లను దూరంచేసి నాగరికతా సంపూర్ణంచేసే పవిత్రాశయంకోసం చేసే బలిదానం అంటుంది; ఒక జాతి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని సమానత్వాన్ని సాధించడానికి యత్నిస్తున్నామంటే ఇంకొక జాతి, నిరంకుశపరిపాలననుండి, నియంతృత్వ ప్రమాదంనుండి, వ్యక్తి స్వాతంత్ర్యం, అభివృద్ధి లేని యాంత్రిక జీవితంనుండి ప్రపంచాన్ని కాపాడడానికి కంకణం కట్టుకొన్నామంటోంది. దేనికది వేరే చూస్తే మంచి ఆశయాలలాగే ఉంటాయి; కాని, వీటి ఘర్షణఫలితం మాత్రం ప్రపంచాన్ని తుడిచివేసే అణ్వాయుధాలు, హైడ్రోజను బాంబులు, విషవాయువులు, క్రిమి బాంబులున్నూ.

* * * *

ఏం మహాత్మా! నిన్నంతా దర్శనం లేదు.

నిన్నంతా ఏమిటి, నిన్నటి ఆ పట్టుదలలో వారం పదిరోజులవరకూ బైటపడలే ననుకొన్నాను. కాని, ఇవాళ ఉదయం పనిమనిషి తెచ్చేదేమిటి, మనమే కాఫీహోటలుకివెళ్తే బాగుంటుందనుకొని బయలుదేరేను. అక్కడనుండే నా ప్రయత్నం లేకుండా నే కాళ్ళిక్కడికి ఈడ్చుకొని వచ్చేశాయి.

నిన్నను ఉదయమంతా ఏమీ తోచలేదు. మధ్యాహ్నంకూడా రాకపోడంతో వంట్లో బాగు లేదుకాబోలు, ఇంటికి వెళ్ళేటప్పుడు కొంచెం చుట్టు దారి అయినా మీయింటి పక్కనించి వెళ్ళాలనుకొన్నాను. కాని, తీరా కొట్టుకట్టేసి, బయలుదేరడంతో కాళ్ళు మామూలుదారిని లాక్కుపోయాయి. ఇంటికివెళ్ళేను, భోంచేసేను, కాని ఏమిటో మరిచిపోయినట్టే ఉంది. పదిగంటలు వింటూండగా జ్ఞాపకం వచ్చింది, మీయింటికి వెళ్దామనుకొన్నానని. ఇవాళ ఉదయం మీరు రావడం రాకపోవడం చూసుకొని, మధ్యాహ్నం రావాలనుకొన్నాను.

ఒక్క నెల్లాళ్ళు తెలిసినంత మాత్రంలోనే ఒకళ్ళగురించి ఒకళ్ళం ఇంత ఆలోచిస్తున్నాము. మన దైనికచర్య అంతా తారుమారయిపోయిందనుకొంటున్నాము. కాని, ఆ బాల్యమూ తెలిసినవాళ్లు, ఒక్కరోజయినా విడవలేమనుకొనేవాళ్లు హఠాత్తుగా పోతే, ఏమీ లేనట్టే, మనకు సంబంధించనట్టే ఊరుకొంటాము.

అదే చిత్రం మనస్సులు రబ్బరు బంతులలాటివి. కొంచెం గాలి కొట్టినా నిండినట్టే ఉంటుంది; చాలా ఎక్కువగాలి ఉన్నా అలాగే ఉంటుంది చూడ్డానికి. అంత మరీ ఎక్కువయితే ధన్‌మని పగిలిపోతుంది. అవే హత్యలూ ఆత్మహత్యలూ మొదలయిన అఘాయిత్యాలు—అసలు వ్యవహారం, ఏమిటికథా, నిన్నంతా దర్శనం లేకపోడానికి?

ఏమీ లేదు, ఆమధ్యను మీదగ్గర నోట్‌బుక్ పుచ్చుకొన్నానుకదూ. ఇన్నాళ్ళా ఏం చెయ్యడమో నిశ్చయంలేకుండా ఉంది. నిన్నను ఒక నిశ్చయానికి వచ్చేను. మనపని ఎలాగూ ఆరంభశూరత్వమే—అధమం బుద్ధిపుట్టగానే ఆరంభిస్తే ఆ వేడి చల్లారకుండా పని సాంతమయిపోతుందేమోనని.

అంటే ఏమిటి, పగలు రాత్రి అని భేదం లేకుండా, ఆహారనిద్రలను కూడా అలక్ష్యంచేసి రాయాలనుకొన్నారన్నమాట, అదే నాకిష్టంలేదు. దేనికయినా ఒకవేళా, ఒక పద్ధతి అని ఉండాలి. అలా అయితే చేసినపని కష్టం అనిపించదు. ఒక్క రోజులో ఏదో ఆకాశం తలక్రిందులు చేసేమని కాకపోయినా పదిరోజుల తరవాత ఫలితం కనిపిస్తుంది.

నిజమే మీరు చెప్పినవిధంగా సాగితే మంచిమాటే—కాని, ఇది పుస్తకం పారాయణ చెయ్యడంగాని, చూసి రాత రాయడంగాని కాదుకదూ! రోజూ లెక్కప్రకారం రాద్దామనుకుంటే, రాయాలని ఉత్సాహం ఉన్ననాడు, మన లెక్క సమీపించేసరికల్లా మానెయ్యడం జరుగుతుంది గాని, తక్కిన రోజుల్లో అసలు పని చెయ్యడమే జరగదు—సరే దీని మాటకేమి, నిన్నను ఆరంభించడం జరిగింది. ఇదివరకు రాసేపాటికి ఒకొక్కప్పుడు అంతా పూర్తి అయినా పేరేదో

అనుమానంగానే ఉండిపోయేది. నిన్ననుపేరుకూడా నిర్ణయమయిపోయింది 'జీవిత వృత్తము' అని. మీరిచ్చిన డైరీలో ఒక యాభై పేజీలు నిండింది. నిన్నటిలాగ మరి రోజూ రాయడం కాకపోయినా అథమం రోజు కొక పాతిక పేజీలయినా కాకపోదని. అంతా ఈ నెలాఖరులోగా పూర్తి కావాలి. మరేమీ లేదు, నావంటి అసమర్థుడు అంటే చాలావాటిలో సామర్థ్యం ఉందనుకొంటూ కూడా దేనిలోనూ స్థిరత్వం లేక, అందుకుతోడు విధికృతము లనిపించే ఆఘాతాల తాకిడికి తూలిపోయిన మనిషి గత జీవితాన్నంతా సింహావలోకనం చేసుకోడమే నా రచనకి వస్తువు. నిజం చెప్పాలంటే ఇంతవరకు నేను రాసినవాటిల్లో సాధ్యమయినంతవరకు ఆత్మకథ అనే స్ఫురణ లేకుండా ఉండడానికే ప్రయత్నించేవాణ్ణి. సంగీతజ్ఞుడు, చిత్రకారుడు, నటకుడు వీళ్ళంతా ఇతరుల అనుభూతులను స్వంతం చేసుకొని ప్రదర్శిస్తున్నట్టే కవి కూడా కేవలం సొంత ఘోషగా కాకుండా ప్రపంచాన్ని పరిశీలించి, ప్రకటించడమే బాగుంటుం దనుకొనేవాణ్ణి. ఇప్పుడూ నా ఉద్దేశము నిజంగా అదే. కాని, ప్రస్తుతం ఎక్కువగా ఆలోచించి కొత్తవి రాయలేను, మనస్సు అందుకు తగినంత నిర్మలంగా లేదు; అలాగని రాయకుండానూ ఉండలేను. అందుచేత ఈ ఆత్మకథాత్మక రచన. ఇదివరకు ఏది రాసినా మొదలుపెట్టిన దగ్గరనుంచి పూర్తిఅయేవరకూ, భార్యకుగాని ప్రాణస్నేహితులకిగాని చూపించే అలవాటుండేదికాదు. కాని, ఈమారు మాత్రం ఎప్పటికప్పుడు మీకు చూపిస్తూ ఉంటాను మీరువిని ఊరుకోడంకాదు, మీ విమర్శన సాగిస్తూ ఉండాలి; అందువల్ల నేను అంతా మార్చేసుకొంటానని కాదు, కాని, మీరేమన్నదీ గుర్తుపెట్టుకొని ఉంచుకొంటాను. తరవాత, మరి కొంతకాలానికి అంటే మీ వయసు వచ్చేక నేనూ మీలాగే ఆలోచిస్తానేమో చూడాలని.

చాలా బాగుంది. అయితే ఇప్పుడు తెచ్చేరా?

లేదు, అసలు ఇక్కడకు రావాలనుకొంటే కదూ? అయినా ఇదికాదు పద్ధతి, రోజూ నేను రాత్రి, ఉదయం రాస్తాను. సాయంకాలం అంటే మధ్యాహ్నం కాఫీ అయిపోయిన వెంటనే ఇక్కడికి వచ్చేస్తాను. కలిసి చదువుకొందాం, చర్చించుకొందాం. మీరు ఈ మన జీవితాల ఆటలో చివరివరకూ ఆడి పండిపోయారు; నేను ఆటలోని అన్యాయాలకు తట్టుకోలేక మధ్యలో పక్కకు తప్పుకొన్నాను. ఇటువంటి మనబోటి ఒంటరి జీవితపు ఒంటెలకున్నదేమిటి గత చరిత్ర సంస్మరణం వినా?

ఈ మధ్యనల్లా నేనూ అలాగే అనుకొన్నాను కాని, భగవంతుడు నాకు మళ్లీ ఈ వయస్సులో కూడా ఒంటరిగా, ఒకరితో పూచీలేని జీవితాన్ని సాగనిచ్చేట్టు లేదు. మీతో చెప్పడంపడలేదు, నాలుగురోజుల కిందట మా శశిరేఖ వచ్చింది. దానిదంతా ఒక చిత్రమయిన కథ. కథ కేముందిలెండి, చిన్నతనంలో తండ్రి పోయేడు; తల్లి ప్రపంచంతో సంబంధం లేకుండా పరధ్యానంగా ఉండేది; నేను అదుపు ఆజ్ఞలలో పెట్టలేకపోయాను. అయినా తక్కిన వాళ్ళంతా ఏదో సంసారపక్షంగా పెళ్ళిళ్లు చేసుకొని, వాళ్ళ బతుకులు వాళ్లు బతుకుతున్నారు కారూ? దీనికంతా మొదటినుంచీ ఒకరి లక్ష్యంలేని స్వభావమే. దాని పదిహేడో ఏట ఇల్లువదిలి వెళ్ళిపోయింది; ఇప్పటికి పదేళ్లు దాటిందనుకొంటాను. ఇన్నేళ్లు పోయింతరవాత దానికెందుకు తిరిగి రావాలని బుద్ధిపుట్టిందో?

ఆవిడ రావడం మీకంత ఇష్టంగా లేకపోతే మొదటే వద్దని నిష్కర్షగా చెప్పలేకపోయారా? ఆవిడకు మీమీదఉన్న హక్కేమిటి?

హక్కు అధికారం అన్న దృష్టితో నేను చూడలేదు. మామయ్యా, వెధవ ప్రపంచం, మనుషులూ అంటే అసహ్యమేసింది; అయినా ఎంచేతో చూడాలనిపించి ఆఖరి ప్రయత్నంగా నీదగ్గరికి వచ్చాను; అన్నయ్యలు, అక్కలూ చెల్లెళ్లు, బావలూ వదినలూ నన్ను ఎంత అసహ్యించుకొంటారో నాకు తెలుసును. నువ్వు వాళ్లలాగే అయితే వెళ్ళిపోతాను"; అన్న పరిస్థితిలో ఎలా తగిలివెయ్యడం చెప్పండి.

నేననేది అది కాదు, మీరు చేసింది మంచిపనే. అయితే అందుకు ఏదో పొరపాటయినట్టు ఎందుకు విచారిస్తున్నారో నా కర్థం కాకుండా ఉంది.

మరేం లేదు, అది ఇంతకాలం బతికిన బతుకు సంగతి నేనడగనూ లేదు, అది చెప్పనూ లేదు; అదే మంచిదిలెండి. నాకేం పెద్ద అపకీర్తి భయమూ లేదు; కాని ప్రస్తుతపు నా పరిస్థితుల్లో దాన్ని పోషించడం అంత పెద్ద కష్టం కాదనుకోండి; కాని ఏమిటి చెప్పడం, మానవ నైజం; అందులో అది ఇదివరకు స్వేచ్ఛ నెరిగిన మనిషి; ఇక దానికి ఒక సంసారం అంటూ కూడా తయారయితే...పటాటోపం పెరుగుతుంది; అందుకు తగిన ఆర్జన ఇప్పుడు లేదు; ఇక ముందు చేయాలనే కోరికా లేదు.

అంతలా ముందు ముందు ఏదో జరిగిపోతుందని భయపడడం ఎందుకు చెప్పండి? పదిహేడో ఏట

మొగట పారిపోయి, పదేళ్లు స్వేచ్ఛగా బ్రతికిన మనిషి, పాతికేళ్ళ వయస్సులో మరొకడితో లేచి పోదనే నమ్మక మేమిటి? మబ్బు ఎలా వచ్చిందో అలాగే విడిపోకూడదా?

ఏదో మాటికి మాట అన్నానుగాని మరి ఆరు నెలలనాడు ఆ లేవదీసుకొని పోయేమనిషిని నేనే అవుతానని ఎవరయినా జోస్యం చెప్తే పిచ్చివాళ్లను కొనేవాణ్ణి. యథార్థవిషయాలు ఊహలకంటె కూడా వింతగా విపరీతంగా కనిపిస్తూ ఉంటాయి అప్పుడప్పుడు.

ఆ తరవాత ఒక వారం రోజులపాటు శ్రద్ధగా నేను రోజూ అన్న ప్రకారం పాతిక ముప్పై పేజీలు రాయడం చదవడం జరిగింది అంతలో మా మేనత్తకి చాలా ప్రమాదంగా ఉంది వెంటనే బయలుదేరి రావలసిందని టెలిగ్రాము. నా చిన్నతనంలో కోపం లేని అభిమానం ఉండేది నాకు ఒక్క మా మేనత్త అంటేనే. తక్కిన పెద్దవాళ్లు ఎంత ముద్దుచేసినా, ఏదో ఒకదానికి తిడుతూ ఉండేవారు. నా నవల లోని మొదటి రెండు మూడు ప్రకరణాల్లో మా మేనత్తదే ప్రధాన పాత్ర. ఈ ఆలోచనలన్నీ ఇప్పుడు వచ్చినవి, కాని, టెలిగ్రాము అందిన వెంటనే బయలుదేరేను. వెళ్ళినతరువాత ఒకటి రెండు రోజులు చాలా ప్రమాదంగానే ఉంది; తరవాత తగ్గింది; ఈమారుకి మరి తేరిపోయిందనుకొన్నాం. కాని, నాలుగురోజుల్లోనే మళ్ళీ తిరగబెట్టింది. ఆవిడ పోవడం చాలా సబబయిన సంగతే. కొడుకులూ కూతుళ్ళూ అందరూ పెద్దవాళ్ళయి ఎవరిబ్రతుకు వారు బ్రతుకుతున్నారు. తనకా పెద్దకోరికలు లేవు. అయితే నాకుమట్టుకు ఆ యిరవైఅయిదు రోజులూ ఒక చిత్రమయిన అనుభవం—సుమారు రోజంతా జబ్బు మంచందగ్గర కూర్చొని, ఏవేవో కబుర్లు వినడం, భారతం చదవడం,—అయితే మందులివ్వడం పూచీ మాత్రం నాకు లేదు; కోడళ్లో కూతుళ్లో వచ్చి మందు మింగించి వెళ్లిపోతూ ఉండేవారు. వాళ్ళు మందులు పట్టడం కష్టం లేదు; కాని రోజురోజంతా జబ్బుమనిషి మంచందగ్గర కూర్చోడానికి వాళ్ళ కెలా తీరుతుంది?

నేను తిరిగి వచ్చేసరికి నెల్లాళ్లు దాటింది. మామూలుగా ఉదయం వెళ్ళేసరికి షాపు తీసిలేదు. ఇంకా రాలేదు కాబోలు ననుకొని, లైబ్రరీకి వెళ్లి కూర్చున్నాడు. తిరిగి వచ్చేటప్పటికీ మూసేఉంది. ఆ సాయంత్రమూ మర్నాడూ కూడా షాపు తెరుచుకోలేదు. మరి ఊరుకోబట్టక ఆ సాయంకాలం వాళ్లింటికి బయలుదేరేను.

ఇల్లు కనుక్కోడం పెద్దకష్టం కాలేదు.

ఆవిడ తలుపు తెరచి ఓహో మీరా? డాక్టరుగా రనుకొన్నాను" అంది. నేను కొంచెం గాభరా పడుతూఉంటే ఆవిడ, నాకు తెలుసునులెండి, మామయ్యగారి స్నేహితులు కవిగారుకదూ మీరు, మామయ్య మీగురించి చాలా చెప్పాడులెండి. లోపలికి రండి."

అలాగే కాని, ఆయన కృష్ణమూర్తిగారు ఊళ్ళో లేరా?

లేకేం ఉన్నాడు. ఇంట్లోనే. ఇంతసేపూ మేలుకొనే ఉన్నాడు. ఇప్పుడిప్పుడే కొంచెం నిద్ర పట్టింది.

అలాగా, అసలు ఏమిటి వంట్లో బాగులేదా?

బాగు లేకపోడమని ఒక రకంగా కాదు; జ్వరం; కడుపులో నొప్పి, దగ్గు, నిద్రపట్టకపోవడం. ...ఇన్నిటికీ తోడు ముసలితనం, బలహీనత, పథ్యం పథ్యం అని ఆ డాక్టరు తినమన్న పాటీ తినడు.

తింటే జబ్బులు పోతాయా?

పోకపోయినా కొంత బలమయినా వుంటుంది. గుమ్మంలోనే నిలబడిపోయారు. లోపలికి వచ్చి కూర్చోండి.

ఆయన నిద్రపోతున్నారుకదూ. రేపుదయం మళ్ళీ వస్తాను.

ఎంతసేపులెండి. నిద్ర ఒక్క పావుగంటే. అదీ ఇప్పుడు తాగిన మందు మహాత్మ్యమయి ఉంటుంది. మీకోసం ఎంతో ఎదురుచూస్తున్నాడు. వచ్చి వెళ్ళిపోయేరంటే నామీద కోప్పడతాడు కూర్చోమనలేక పోయావా అని. ఊరికే కూర్చో అక్కరలేదులెండి, ఏవో పత్రికలున్నాయి; తిరగవేస్తూవుంటే ఈలోగా ఒక కప్పు కాఫీ చేసి ఇస్తాను.

మధ్యను సావిడి, ఇటొక గది అటొక గది. అవతలిగదిలో జబ్బు మంచం. ఇవతలిగదిలో నన్ను కూర్చోమంది. గదికి పెద్ద అలంకారాలు లేవుగాని, ఉన్నంతలో పరిశుభ్రంగా ఉంది. పడకకుర్చీ, ముందుబల్ల, షెల్ఫులో కావలసినన్ని పత్రికలూ పుస్తకాలు, నేనింకా పత్రికలూ పుస్తకాలూ ఏవి ఉన్నాయో చూస్తూఉండగానే ఆవిడ మంచినీళ్ళు తీసుకొనివచ్చి బల్లమీద ఉంచుతూ అడిగింది.

"ఇంతసేపూ అడగడం మరిచిపోయేను మీ మేనత్తగారి కెలా ఉంది?"

ఆవిడ మళ్ళీ కాఫీ కలపడానికి లోనికి వెళ్ళే వరకూ నేను మా మేనత్త జబ్బుగురించే చెప్తూఉన్నాను.

"అనుకోకూడదు గాని, డాక్టరు చెప్పిన మాటల్ని బట్టిచూస్తే మాత్రం మా మామయ్య వ్యవహారంకూడా అనుమానంగానే ఉంది. కాని అతను ఇప్పుడిప్పుడు కొంచెం నయమంటున్నాడు."

డాక్టర్లూ మానవమాత్రులే—వాళ్ళకి చేతనయినదివాళ్ళు చేస్తారు.

కాఫీ తీసుకొనివచ్చి బల్లమీద పెడుతూ "కవీశ్వరులకి కాఫీలో పంచదార ఎక్కువకాకూడదని తక్కువగా వేసి తెచ్చేను. కావాలంటే మొగమాట పడకుండా చెప్పండి."

"బాధ లేదులెండి. పంచదార తక్కువగా ఉన్నా సర్దుకోగలను." ఆవిడ నన్ను సర్దుకోనియ్యలేదు.

నేను కాఫీ తాగుతూఉండగా ఆవిడ నా పుస్తకం గురించి అడిగింది. ఆయన కృష్ణమూర్తిగారు చెప్పారుట. తను గాని ఈ జబ్బు దాటి మామూలు మనిషయితే తానూ తన జీవితచరిత్రంతా రాయదలచుకొన్నారట—ఇలా మేము మాట్లాడుతూ ఉండగానే ఆయనకు మెలకువ వచ్చింది. రాత్రి నేను నా బసకు చేరుకొనేసరికి పది గంటలయింది.

తరవాత సుమారు మూడు నెలలు రోజూ ఉదయం సాయంకాలం అక్కడే నా కాలక్షేపం. ఆయన జబ్బు చాలా చిత్రంగా ఉండేది ఒక వారం పది రోజులు పూర్తిగా తగ్గిపోయింది. ఇంక లేచి తిరగవచ్చునన్నంతలా అనిపించేది. మళ్ళీ అంతలోనే ఇక మరి ఈ వారం దాటడం కష్టం అనిపించే స్థితిగా ఉండేది. శశిరేఖ ఎప్పుడూ ఒక్కలాగే మాట్లాడేది. వాళ్ళ మామయ్య మేలుకొనిఉన్నా లేకపోయినా నేను మామూలుగా ఉండే గంటలు ఉండి మాట్లాడి కాఫీ తాగి మరీ వెళ్ళవలసిందే.

ఆవేళ వ్యవహారం జరిగిఉండకపోతే అలాగే చివరివరకు జరిగిఉండును. ఆవేళ మధ్యాహ్నం మామూలుకంటె కూడా కొంచెం వేగంగా బయలుదేరేను, అదివరకు రోజూ శశిరేఖ అడగడమే గాని నేను నా పుస్తకం ఎప్పుడూ తీసుకొనివెళ్ళలేదు. మరిక వాయిదా వెయ్యడం సాధ్యంకాదని పుస్తకం పట్టుకొని వేగం బయలుదేరేను.

కృష్ణమూర్తిగారు గాఢంగా నిద్రపోతున్నారు. రెండవ గదిలో కూర్చొని చదువుకొందామని వెళ్తుండగా పెరటి చీడీలోంచి మాటలు వినిపించేయి. డాక్టరు సుందర్రావుగారు ఇదే సమయమని శశిరేఖను బలవంతపరుస్తున్నాడు. నిన్ను నర్సుని చేయిస్తాను. మీ మామపోయినా బాధలేదు; నిజంగా బిల్లుచేసి ఉంటే ఈసరికే నాలుగువంద లయిఉండును;—నీ వెనుకటి చరిత్ర నాకు తెలియకపోలేదు. ఇన్నాళ్ళాయి తప్పించుకొన్నావు; ఇవాళ మరి తప్పదు; ఏం, ఆ గిరజాల కవిగాడి పాటి చేసేను కానా!

నేను ప్రవేశించి సినీమా కథానాయకునిలాగ బలప్రదర్శన చెయ్యవలసిన అవసరం లేకపోయింది. మాట్లాడకుండా తప్పుకొని వీధిలోకి తిన్నగా వెళ్ళిపోయాడు మందుల సంచీ సైతం విడిచిపెట్టి—తరవాత మూడు నెలలకి గాని కృష్ణమూర్తిగారు పూర్తిగా కోలుకోలేకపోయారు. అప్పటికి శశిరేఖ అనుమానం లేకుండా గర్భవతి—ఆయన ఎదుట పడడానికి నాకు మొగమాట మనిపించింది. ఒకనాడు రాత్రి బయలుదేరి వెళ్ళిపోయాము. ఆయనకు ఎంతో కోపం వస్తుందనుకొన్నాము. అటువంటిదేమీ లేదు. తనకుగల కొద్దిపాటి ఆస్తినీ మీ సంతానానికే ఇచ్చేస్తానంటూ రాశాడు. ఒక ఏడాదిపాటు ఉన్నచోట ఉండకుండా మేము తిరిగి, తిరిగి వచ్చేము. తరవాత సుమారు ఆరేళ్ళు బ్రతికాడు ఆయన. మా కుర్రవాడికి ఆయన పేరే పెట్టేము. వాళ్ళిద్దరికీ తాతా మనవడు వరస. మావాడికి మా యిద్దరి దగ్గరకంటె తాతగారిదగ్గరే చనవు. ఆయన దగ్గరే పడుకొనేవాడు. ఆయనతోనే షాపుకి వెళ్ళేవాడు—ఆయనతోనే ఆడుకొనేవాడు. వార్ధక్యం రెండవ బాల్యం అన్నమాట ఆయనపట్ల సార్థకమయినంతగా మరెవ్వరిపట్లా సార్థకమయి ఉండదు. అయితే చిత్రమేమిటంటే తరవాత పుట్టిన ఆడపిల్లకీ మగపిల్ల వాడికీ ఆయనదగ్గర ఏమీ చనవు లేదు.

ఆయన తరుచు అంటూ ఉండేవాడు, ఒరే తాతా నేను చచ్చిపోయేలోగా నీకొక పదివేలయినా పజిల్సు మూలంగా సంపాదిస్తానురా అని. పధ్నాలుగువేలు వచ్చింది కాని, అది వచ్చిందని తెలిసిన నాటికి పూర్తిగా తెలివిలేదు. ఏదో సగం సగంగా బోధపడింది. మేమూ తన తృప్తికోసం అంటున్నామేమోనని అనుమానంకూడా కలిగినట్టుంది.

మా అందరికీకూడా కష్టమే ననిపించిందిగాని, మా కృష్ణుణ్ణి మాత్రం మరిపించడం మాతరం కాలేదు—తల్లిదండ్రులు పోయినప్పుడుకూడా పిల్లలు అంతగా బాధపడి ఉండరేమో.

ఆయన బ్రతికి ఉన్నంతకాలం తన చుట్టుపక్కలవారిని సుఖపెట్టాలనే చూసేడు. ఆయన చరిత్ర రాయగలగడంలో నా చరిత్ర రాసుకోలేదనే విచారం మరి నాకు లేదు.

[సంపూర్ణం]